


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





**20న అప్పన్న చందనోత్సవం**

- వివరాలు 8 లో.



## క్వాంటమ్ శకంలోకి ఏపీ!

ప్రపంచ క్వాంటమ్ డే పురస్కరించుకుని దేశ చరిత్రలో కీలక ఘట్టానికి ఏపీ వేదికవుతుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో భాగంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతమవుతున్న క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీతో సాంకేతిక శకంలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. విజన్ నుంచి క్యూబిట్స్ వరకు –ఆంధ్రప్రదేశ్ భారత్ క్వాంటమ్ భవిష్యత్‌ను నిర్మిస్తోందని విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేయడం ఇందులో భాగమే.



5



### శరవేగంగా అనుమతులు...

## సరళంగా నిబంధనలు!

- బ్రిటీష్ కాలంనాటి చట్టాల తొలగింపు.. అవసరమైతే ఆర్డినెన్స్
- పారిశ్రామిక ప్రగతికి మేనాటికి డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలు
- స్టీల్ సెక్రటరీ సందీప్ పొండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు భేటీ
- రాష్ట్రంలో అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ విధానాలపై సీఎం సమీక్ష

3



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2పై స్టీల్ సెక్రటరీ సందీప్ పొండ్రిక్ బృందంతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు



### అమరావతి..

## అజరామరం

- ఐదుకోట్ల ఆంధ్రుల తరపున ధన్యవాదాలు
- రాష్ట్రపతి ముర్ముకి మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీల కృతజ్ఞతలు
- రైతుల త్యాగ ఫలితమే అమరావతి
- పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందన్న రాష్ట్రపతి

4

### స్కూళ్లు పునఃప్రారంభనాటికి

## పూర్తి వసతులతో ప్రభుత్వ హాస్టళ్లు

- అర్బన్ ప్రాంతాల్లోనూ జలధార
- తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య రాకూడదు
- పేదలు సంతృప్తికరంగా భోజనం చేసేలా అన్న క్యాంటీన్ల నిర్వహణ
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష



2

## అందరికీ ఆహార భద్రత

- అందుబాటులోకి 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు
- ఇప్పటికే 207 క్యాంటీన్ల ద్వారా నిత్యం 2.10 లక్షల మందికి భోజనం
- 15న ధరణికోటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



3

### ఏపీ క్యాబినెట్ ఎజెండా

## తయారీలో మార్పులు

- టైమ్‌లైన్స్ విధిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు
- ఇక ఈ-క్యాబినెట్ పోర్టల్ ద్వారానే సమాచారం

- వివరాలు 7 లో..



### పురపాలక ఎన్నికలకు

## సన్నాహాలు

- మొదలైన డివిజన్లు, వార్డుల పునర్విభజన
- రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాల ప్రచురణకు కసరత్తు

- వివరాలు 10 లో..

## జగన్‌వి శవ రాజకీయాలు

- జనం ఛీకొట్టినా అమరావతిపై అబద్ధాలు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజం

7



### ఫిషింగ్ హార్బర్‌పై

## నీచ రాజకీయం సిగ్గుచేటు

- నెల్లూరు ఎందుకు వెళుతున్నారో జగన్ చెప్పాలి
- నాడు వైఎస్ అడ్డగోలు జీవోలిచ్చి అడ్డుకున్నారు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

8



# స్కూళ్లు పునఃప్రారంభంనాటికి
# పూర్తి వసతులతో ప్రభుత్వ హాస్టళ్లు



- అర్బన్ ప్రాంతాల్లోనూ జలధార
- తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య రాకూడదు
- పేదలు సంతృప్తికరంగా భోజనం చేసేలా అన్న క్యాంటీన్ల నిర్వహణ
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి (చైతన్య రథం): పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లన్నీ పూర్తి వసతులతో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ హాస్టల్ గాడిలో పడాలని... అన్ని రకాల వసతులుండాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి క్షేత్రస్థాయిలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "జూన్‌లో స్కూళ్ల రీ-ఓపెనింగ్ నాటికి హాస్టళ్లు అన్నీ చక్కగా ఉండాలి. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండాలి. టాయిలెట్లు.. ఆర్వో ప్లాంట్లు సిద్ధంగా ఉండాలి. హాస్టళ్లకు సంబంధించి వసతులపై ఎలాంటి ఫిర్యాదులు రాకూడదు. హాస్టళ్లల్లో వసతులు మెరుగుపరిచేందుకు నిధులు కేటాయించాం. సాస్కీ నిధులతో ఈ పనులు చేపడుతున్నాం. నిధులు అందించిన తర్వాత కూడా ఇంకా ఫిర్యాదులు వస్తే అది అధికారుల తప్పిదమే అవుతుంది. వసతులను ఏర్పరచడమే కాకుండా... వాటిని సక్రమంగా నిర్వహించేలా కూడా చూడాలి. ఈమేరకు నిరంతర పర్యవేక్షణ చేపడుతూనే ఉండాలి. హాస్టళ్లలో ఆహారం, నీటి సరఫరా విషయంలో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... పారిశుధ్యం విషయంలో తేడా రాకుండా చూసుకోవాలి. ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాస్టళ్లను నిరంతరం తనిఖీలు చేస్తూ ఉండాలి. ఇక నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలూ కన్పించకూడదు. తాగునీటి సరఫరా, వీధి దీపాల విషయంలో ఫిర్యాదులు రాకూడదు. అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉండడానికి వీల్లేదు. ప్రత్యేకంగా మౌలిక సదుపాయల కల్పన విషయంలో ఫిర్యాదులు రాకూడదు. తాగునీటి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి. తాగునీటిని అందించడంతోపాటు.. స్వచ్ఛమైన తాగునీరును... కలుషితంలేని నీటిని ప్రజలకు అందించేలా చూడాలి. తాగునీటి పైప్ లైన్లల్లో డ్రైనేజీ నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తరుచూ నీటి శాంపిళ్లను కలెక్ట్ చేసి ల్యాబుల్లో టెస్ట్ చేయించాలి. వీధి దీపాలు నిరంతరం పనిచేస్తూనే ఉండాలి. సెన్సిటివ్ ప్రాంతాల్లో వీధి దీపాల సమస్య ఉండకూడదు. పట్టణ ప్రాంతాల్లో చెత్త సేకరణ ఎక్కడా ఆగకూడదు. పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, వీధి లైట్లు, డ్రైనేజీ, చెత్త సేకరణవంటి అంశాల్లో ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించే మెకానిజం ఉండాలి. పని పూర్తి చేశాక స్థానికులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. ఫిర్యాదు చేసిన వెంటనే ప్రభుత్వం స్పందించింది. మున్సిపల్ అధికారులు స్పందించారనే భావన ప్రజలకు కలిగేలా చేయాలి. మున్సిపల్ కమిషనర్లకు స్పష్టమైన గైడ్ లైన్స్ జారీ చేయాలి. ఈమేరకు మున్సిపల్ అధికారుల పనితీరును ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. స్వచ్ఛ సర్వేక్షణ్‌వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆ ఫలితాలు స్పష్టంగా పట్టణాల్లో కన్పించాలి. తాడిపత్రి పట్టణంలో పారిశుధ్యం చక్కగా నిర్వహిస్తారు. అక్కడి నాయకులు చొరవ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. నేతలు చొరవ తీసుకున్నచోట మంచి ఫలితాలు కన్పిస్తున్నాయి. స్వచ్ఛత విషయంలో తాడిపత్రి రోల్ మోడల్" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.


## మహిళల భద్రత అత్యంత ప్రాధాన్యం

"మహిళలపై నేరాల విషయంలో ఏమాత్రం అలక్ష్యం వద్దు. మహిళల జోలికి రావాలన్నా.. అఘాయిత్యం చేయాలనే ఆలోచన రావాలన్నా ఒణికి పోయే పరిస్థితి తీసుకురావాలి. సంక్షేమం, అభివృద్ధి, పరిశ్రమలు, పెట్టుబడులకు ఎంతటి ప్రాధాన్యతనిస్తున్నామో.. దానికి పదింతల ప్రాధాన్యత మహిళలు, చిన్నారుల భద్రతకు ఇస్తున్నాం. శాంతి భద్రతలను పాటించే విషయంలో నేరాలను కట్టడి చేసే సందర్భంలో ఏమాత్రం రాజీ పడొద్దు. తప్పు చేసిన వారిని త్వరితగతిన అరెస్ట్ చేయడమే కాదు... వారికి శిక్షలు పడేలా చూడాలి. మహిళల్లో భయాన్ని పోగొట్టాలి. తప్పు చేసేవారిలో భయాన్ని పెంచాలి. మహిళా భద్రతకు సంబంధించి నిరంతరం ప్రజల్లో అవగాహన పెంచాలి. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా గంజాయి రవాణా, సాగు, వినియోగం ఉండేది. నాటి పరిస్థితితో పోల్చుకుంటే చాలావరకు తగ్గింది. గంజా, డ్రగ్స్ ప్రభావం కన్పించకుండా చర్యలు తీసుకోవాలి. గంజా నివారణకు రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈగల్ విధానాన్ని ఒడిషా ప్రభుత్వం అధ్యయనం చేసింది. మన రాష్ట్ర విధానాన్నే ఒడిషా అవలంభిస్తోంది. అన్న క్యాంటీన్లను మరింత విస్తరిస్తున్నాం. అర్బన్ ప్రాంతాల్లోనే కాకుండా రూరల్ నియోజకవర్గాల్లోనూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయబోతున్నాం. పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టడమనేది ప్రభుత్వ బాధ్యత. పేదలు సంతృప్తిగా కడుపు నిండా భోజనం చేసేలా అన్న క్యాంటీన్లను నిర్వహించాలి. అన్న క్యాంటీన్ల నిర్వహణ ఎలా ఉందో తెలుసుకోవడానికి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి. కొత్తగా అన్న క్యాంటీన్లు అందుబాటులోకి వస్తే... ఏడాదికి సుమారు రూ.200 కోట్లు ఖర్చువుతుంది. అన్న క్యాంటీన్లకు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేలా మోటివేట్ చేయాలి" అని సీఎం చంద్రబాబు సూచించారు.

## విద్యార్థి దశనుంచే ఆవిష్కరణల ఆలోచనలు

"రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వీలైనన్ని ఇన్నోవేషన్లు వచ్చేలా చూడడంతోపాటు... విద్యార్థి దశ నుంచే ఆవిష్కరణలు చేయాలన్న ఆలోచనలు రేకెత్తించే విధంగా ఆర్టీఐహెచ్ చొరవ తీసుకోవాలి. యంగ్ స్టూడెంట్ ఇన్నోవేటర్లను తీర్చిదిద్దేలా చూడాలి. అగస్త్యవంటి సంస్థలు విద్యార్థుల్లో ఆవిష్కరణను ప్రోత్సహిస్తున్నాయి. వినూత్నంగా ఆలోచన చేస్తున్నాయి. ఇలాంటి సంస్థలతో ఆర్టీఐహెచ్ కలిసి పని చేస్తే మంచి ఫలితాలు రాబట్టవచ్చు. 175 నియోజకవర్గాల్లో ఉండే ఎంఎంస్ఎంఈ పార్కులతో ఆర్టీఐహెచ్ అనుసంధానమై పని చేస్తే ఎలా ఉంటుందో ప్రణాళికలు సిద్ధం చేయండి. ఎన్విడియావంటి సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇలాంటి సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తే... ఎకో సిస్టం ఏర్పడుతుంది. ఏజెన్సీ ఏరియాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందించే అంశంపై ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టాలి.

అల్లూరి, మన్యం, పోలవరం జిల్లాల్లో డ్రోన్ల ద్వారా హెల్త్ సర్వీసులు అందించే పైలెట్ ప్రాజెక్టులు చేపట్టాలి. ఈ ప్రయోగం దేశానికి ఓ మోడల్‌లా ఉండాలి. జలధార కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలి. నరేగా అనుసంధానంతో పాటు... అవసరమైన ప్రాంతాల్లో యంత్రాలను వినియోగించుకోవాలి. అన్ని చెరువులకు నీళ్లు నింపే విషయంలో అన్నమయ్యజిల్లా మోడల్ అవలంభించాలి. డ్రైన్లు, కాల్వలను బాగు చేయాలి. 15న సాగుకు నీటి విడుదల చేపడతాం. దాన్ని దృష్టిలో పెట్టుకుని జలధార పనులు చేపట్టాలి. అవసరమైతే అన్నమయ్య జిల్లాకు మిగిలిన జిల్లాల నుంచి బృందాలు పంపి ట్రైనింగ్ ఇప్పించండి. అర్బన్ ప్రాంతాల్లో కూడా జలధార కార్యక్రమం చేపట్టాలి. జలధారపై ప్రతీవారం సమీక్షిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# శరవేగంగా అనుమతులు... సరళంగా నిబంధనలు!



- బ్రిటీష్ కాలంనాటి చట్టాల తొలగింపు.. అవసరమైతే ఆర్డినెన్స్
- పారిశ్రామిక ప్రగతికి మేనాటికి డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలు
- స్టీల్ సెక్రటరీ సందీప్ పాండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు భేటీ
- రాష్ట్రంలో అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ విధానాలపై సీఎం సమీక్ష

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఇప్పటికే అమలుచేస్తున్న విధానాలను మరింత సరళతరం చేసేలా చర్యలుతీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అనవసరపు చట్టాలను, నిబంధనలను తొలగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై ముఖ్యమంత్రితో చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం రాష్ట్ర సచివాలయానికి వచ్చింది. ఈబృందంతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం పెంచడం... అనుమతుల సులభతరం చేయడం... అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలను... రూపొందించుకున్న ప్రణాళికలను ఆయాశాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, కేంద్రం సూచించిన మార్పులు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఫేజ్-1 ఎంతవరకు అమలు చేశారని... ఫేజ్-2లో ప్రస్తుత స్థితి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు అధికారులు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు.

### సులభంగా అనుమతుల ప్రక్రియ

పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. బ్రిటీష్ కాలంనాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలని, అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్‌వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా... వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఇక ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని, ఫేజ్-2 అమలు అనంతరం పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.

### ఒకే శాఖలోని అన్ని అనుమతుల విలీనం

డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుకు అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని... ఆ సంఖ్యను దశలవారీగా 57 వరకు తగ్గించాలని సీఎం సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లువంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. ఒకే శాఖలో ఉన్న అనుమతులను విలీనం చేయడం, పర్మిషన్లు కాకుండా... ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానం వంటి వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూవినియోగానికి సంబంధించిన క్లిష్టతను తగ్గించేందుకు భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడంవంటి నిర్ణయాలు ఇప్పటికే తీసుకోగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడిదారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్యరంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

### అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం

నేషనల్ బిల్డింగ్‌కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన సులభమైన ఫైర్ సేఫ్టీ నిబంధనలను తీసుకురావడం, పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం, విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన అందించడంవంటి చర్యలు అమలులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం కల్పించడం, నిర్దిష్ట కాలానికి తనిఖీలు తగ్గించడంవంటి సంస్కరణలతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించే దిశగా పనిచేయాలని సీఎం సూచించారు. ఇక అనుమతులకు సంబంధించిన పూర్తి ప్రక్రియను డిజిటలైజ్ చేయడం కూడా కీలక అంశమేనని సీఎం చెప్పారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువస్తే దరఖాస్తుదారులకు చాలా వరకు పని భారం తగ్గుతుందని... అంతే కాకుండా ట్రాకింగ్, పారదర్శకతను పెంచినట్టు అవుతుందని సీఎం అధికారులకు వివరించారు. మీ-సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సులభంగా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### డి-రెగ్యులేషన్‌లో కేంద్రంకంటే మెరుగ్గా రాష్ట్రం

డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్రం ప్రతిపాదించిన అంశాలకంటే మెరుగ్గా ఏపీ పని చేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబుతో అన్నారు. నిర్దిష్ట గడువులోగా ఏపీ ఫేజ్-2ను అమలు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని పౌండ్రిక్ అభిప్రాయపడ్డారు. నేషన్ ఫస్ట్ నినాదంతో తాము పని చేస్తున్నామని.. ఇలాంటి సంస్కరణల ద్వారా భారత దేశ నిర్మాణం జరుగుతుందని సీఎం చంద్రబాబు చెప్పారు. తాము పారిశ్రామికరంగంలో అభివృద్ధి సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని సీఎం వెల్లడించారు. అటవీ చట్టాలను వీలైనంత సరళీకరించాలంటూ కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా..? అని ముఖ్యమంత్రి స్టీల్ సెక్రటరీని అడిగారు. జూన్ నెలనుంచి ఆ పని మీద ఉంటామని పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్,అవేర్-2.0,వాట్సాప్ గవర్నెన్స్‌వంటి వ్యవస్థలను ఇప్పటికే తాము వినియోగిస్తున్నామని పౌండ్రిక్‌కు సీఎం వివరించారు.

# అందరికీ ఆహార భద్రత

- అందుబాటులోకి 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు
- 269కి పెరగనున్న క్యాంటీన్ల సంఖ్య
- ఇప్పటికే 207 క్యాంటీన్ల ద్వారా నిత్యం 2.10 లక్షల మందికి భోజనం
- 15న ధరణికోటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207అన్నక్యాంటీన్లు ఏర్పాటుచేసిన ప్రజా ప్రభుత్వం... తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా.. 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. రెండవ విడత అన్న క్యాంటీన్లను ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం ధరణికోటలో ప్రారంభిస్తారు

### రూ.5లతో రుచిగా... శుచిగా ఆహారం

గత ప్రభుత్వం కక్షగట్టి మూసివేసిన అన్న క్యాంటీన్లను కూటమి అధికారంలోకి వచ్చాక పున:ప్రారంభించింది. ఈనెల 15న ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269కి చేరుతుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షలమంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చించింది. కొత్తగా ఏర్పాటుచేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సీడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది.

### ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 1.30 గంటలకు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 2.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.




# అమరావతిని అజరామరం చేశారు

- ఐదుకోట్ల ఆంధ్రుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం
- రాష్ట్రపతి ముర్ముకి మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీల కృతజ్ఞతలు
- రైతుల త్యాగ ఫలితమే అమరావతి
- పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందన్న రాష్ట్రపతి



ఢిల్లీ (చైతన్యరథం):ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్రకు దేశ ప్రథమ పౌరురాలు సాక్షి సంతకం కావడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అయిన రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన బిల్లుకు దేశమంతా ఒక్కటై మద్దతివ్వగా,రాజముద్ర వేసి అమరావతికి శాశ్వతత్వం కల్పిస్తూ శాసనం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆంధ్రులు జేజేలు పలుకు తున్నారు.

మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్- మా రాజధాని అమరావతి అని ఆంధ్రజాతి సగర్వంగా తల ఎత్తి చాటేలా చారిత్రక అమరావతి రాజధాని చట్టంపై సంతకం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు రాష్ట్రపతిభవన్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. విభజనతో కోలుకోలేని విధంగా ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని, రాజధానిలేని రాష్ట్రంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని గుర్తించి.. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ చట్టం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకి ఆంధ్రజాతి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరావతి చరిత్ర-సంస్కృతి-రాజధానిలో పూర్తయిన నిర్మాణాలు, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్ ప్రకారం మొత్తం నిర్మాణాలు పూర్తయితే అమరావతి రాజధాని ఎలా ఉంటుందో సూచించే ఊహాచిత్రాలు, పర్యావరణహిత నిర్మాణ విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని ఎంపీలతో కలిసి లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీ, 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరావతి పనులు పునః ప్రారంభించింది ప్రధాని నరేంద్ర మోదీ అని వివరించారు.

### రైతుల త్యాగ ఫలితమే అమరావతి

రాజధాని ఏర్పాటుకు చంద్రబాబు పిలుపుతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూములు రైతులు త్యాగం చేశారని, గత పాలనలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు పెట్టినా, శాంతియుతంగా రాజధాని కోసం ఉద్యమించారని రాష్ట్రపతికి లోకేష్ వివరించారు. కోట్లాది ప్రజల కోరిక అయిన అమరావతి చట్టం తన హయాంలో రూపొందడం సంతోషంగా ఉందని, రైతులు రాష్ట్రంపై ప్రేమతో రాజధాని నిర్మాణానికి తమ భూమిని ఇచ్చారని రాష్ట్రపతి రైతుల త్యాగాలను కొనియాడారు. పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

# మహిళాశక్తితో కొత్తచరిత్ర

## కేంద్ర దిశకు స్వాగతం.. రాష్ట్రానికి మార్గదర్శకం

భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక దశకు దేశం చేరువలో ఉంది. “21వ శతాబ్దం మహిళలదే”నని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్య కేవలం నినాదం కాదు, దేశ భవిష్యత్‌ను నిర్వచించే విధానం. ఢిల్లీలో జరిగిన ‘నారీ శక్తి వందన సమ్మేళన్’ వేదికగా మోదీ వ్యక్తపర్చిన అభిప్రాయాలు.. మహిళా సాధికారతకు కేంద్రమిచ్చే ప్రాధాన్యతను స్పష్టంగా తెలియచేస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును 2029నాటికి అమలు చేయాలన్న సంకల్పం, భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలపర్చే నిర్ణయం. ఈ చారిత్రాత్మక దిశను కూటమి ప్రభుత్వం స్వాగతించడం మాత్రమేకాకుండా, రాష్ట్రస్థాయిలో అమలు చేసేందుకు ముందడుగు వేయడం రాజకీయ దూరదృష్టికి నిలువుటద్దం!

### కేంద్ర నిర్ణయం - మహిళా యుగానికి నాంది

మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే నిర్ణయం దేశ రాజకీయాల్లో నిర్మాణాత్మక మార్పునకు శ్రీకారం చుడుతుంది. ప్రస్తుతం లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం సుమారు 13-14 శాతం మాత్రమే. ఈ రిజర్వేషన్ అమలుతో నేరుగా 33 శాతానికి పెరగనుంది. దాదాపు 2.5 రెట్లు పెరుగుదల. ఇక లోక్‌సభ సీట్లు 543నుంచి 816కి పెరిగే ప్రతిపాదనలో.. సుమారు 273 సీట్లు మహిళలకు కేటాయించే అవకాశం ఉండటం.. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని విస్తరించే కీలక పరిణామం. ప్రధాని మోదీ పేర్కొన్నట్టుగా.. మహిళలు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే శక్తి. వారి భాగస్వామ్యం పెరిగితే విధాన నిర్ణయాల్లో సమతుల్యత పెరిగి.. విద్య, ఆరోగ్యం, భద్రత, సంక్షేమరంగాల్లో 30నుంచి 40శాతం వరకూ ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా పెండింగులోవున్న ఈ సంస్కరణను ముందుకు తీసుకెళ్లడం.. కేంద్ర ప్రభుత్వ రాజకీయ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది.

*ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, రాజకీయ సంస్కరణల ఫలితం -మహిళను ఆధారపడే స్థితినుంచి ఆధారంగా నిలిచే స్థాయికి తీసుకెళ్లాయి. ఇదే సమయంలో స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ల ద్వారా నాయకత్వాన్ని నిరూపించుకున్న మహిళలు, ఇప్పుడు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.*

### చంద్రబాబు దిశ - సంక్షేమంనుంచి నాయకత్వం వరకు

కేంద్రం చూపుతున్న కొత్త దిశను రాష్ట్రస్థాయిలో బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్తోన్న నాయకత్వం చంద్రబాబు నాయుడిదే. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా నాయకులుగా చూడాలనే ఆయన దృక్పథం ఇప్పుడు స్పష్టమైన విధానాల రూపంలో కనిపిస్తోంది.

తెలుగుదేశం పార్టీ చరిత్రను పరిశీలిస్తే మహిళా సాధికారతకు ఇచ్చిన ప్రాధాన్యత సుస్పష్టం. ఎన్టీఆర్ కాలంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం నుంచి ప్రారంభమైన ప్రయాణం.. చంద్రబాబు నాయకత్వంలో డ్వాక్రా వ్యవస్థ ద్వారా ఆర్థిక స్వావలంబన దిశకు మహిళలను చేర్చడం వరకూ సాగింది. 2014-19 మధ్య డ్వాక్రా సంఘాలు 98శాతం రుణాలను తిరిగి చెల్లించడం.. ఏటా రూ.13 వేల కోట్లనుంచి రూ.16వేల కోట్ల వరకూ రుణాలు పొందడం మహిళల సామర్థ్యానికి నిదర్శనం. మొత్తంమీద రూ.1,01,449 కోట్లకు పైగా మహిళల కోసం ఖర్చు చేయడం ఆ దిశలో కీలక అడుగు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సైతం అదే దిశలో ఉన్నాయి. సున్నా వడ్డీ రుణాల పరిమితి రూ.2 లక్షలనుంచి రూ.5 లక్షలకు పెంపు, త్వరలో రూ.10 లక్షలకు పెంపు లక్ష్యంగా కనిపిస్తోంది. మహిళా శిశు సంక్షేమానికి రూ.4,582 కోట్ల కేటాయింపు, ఎస్సీ ఎస్టీ మహిళలకు రూ.50వేల నుంచి రూ.5 లక్షల వరకూ వడ్డీలేని రుణాలు.. ఇవి మహిళలను ఆధారపడే స్థితినుంచి ఆధారంగా నిలిచే స్థాయికి తీసుకెళ్తున్నాయి. ఇదే సమయంలో స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ల ద్వారా నాయకత్వాన్ని నిరూపించిన మహిళలు, ఇప్పుడు రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎదగడానికి సిద్ధమవుతున్నారు.

### వైసీపీ ధోరణి.. మాటల్లో ఒకటి.. వాస్తవాల్లో మరొకటి

ఇదే సమయంలో వైసీపీ ధోరణి తీవ్ర విమర్శలకు గురైంది. మహిళా సాధికారతపై మాటలు చెప్పినా, అమలులో చూపిన పచ్చి అబద్ధాలు ఇప్పుడు గణాంకాల రూపంలో బయటపడుతున్నాయి. సున్నా వడ్డీ రుణాలకుగాను రూ.10లక్షలకు పెంచుతానని హామీనిచ్చి.. ఆ పరిమితిని రూ.3లక్షలకు తగ్గించడం, మహిళలపై నేరాల రేటు 92.6శాతం వరకూ నమోదు కావడం, 30వేలకు పైగా మహిళలు, చిన్నారుల మిస్సింగ్ కేసులు నమోదు కావడం వంటి అంశాలు ప్రజల్లో ఆందోళన రేకెత్తించాయి. ఇవి కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమే కాదు, ప్రజా నమ్మకంపై ప్రభావం చూపిన అంశాలు. అదే సమయంలో కొన్ని వ్యాఖ్యలు, హింసాత్మక ధోరణి ప్రతిబింబించడం కూడా ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తింది. మహిళా సాధికారతవంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలోనూ.. వైసీపీ నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమనేది వారి రాజకీయ బాధ్యతా రాహిత్యాన్ని ఎత్తి చూపించింది.

### మహిళల చేతుల్లోనే కొత్త రాజకీయం

దేశం ఒక కొత్త దిశలో అడుగులేస్తోంది. మహిళా రిజర్వేషన్ వంటి చారిత్రాత్మక సంస్కరణలు ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా మార్చబోతున్నాయి. ప్రధాని మోదీ చూపుతున్న జాతీయ దిశ, చంద్రబాబు నాయుడు అమలు చేస్తోన్న రాష్ట్ర దిశ.. ఇవి మహిళలను లబ్దిదారుల స్థితినుంచి నాయకులుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేస్తున్నాయి. చివరిగా ఒక స్పష్టమైన సత్యం వినిపిస్తోంది. ఇది మహిళల కాలం. ఇది నాయకత్వానికి నాంది. మహిళలు ముందుకు వస్తేనే దేశం, రాష్ట్రం నిజమైన అభివృద్ధిని సాధిస్తాయి. ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతుంది కూటమి ప్రభుత్వం.

- శాంతి జలసూత్రం,
అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

చైతన్యరథం




ప్రపంచ క్వాంటమ్ డే పురస్కరించుకుని దేశ చరిత్రలో కీలక ఘట్టానికి ఏపీ వేదికవుతుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో భాగంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతమవుతున్న క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీతో సాంకేతిక శకంలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. విజన్ నుంచి క్యూబిట్స్ వరకు -ఆంధ్రప్రదేశ్ భారత్ క్వాంటమ్ భవిష్యత్‌ను నిర్మిస్తోందని విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేయడం ఇందులో భాగమే.

## విజన్ నుంచి క్యూబిట్స్ వరకు..

# క్వాంటమ్ శకంలోకి ఏపీ!

గన్నవరంలోని మేధా టవర్స్‌తోపాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటవుతున్న 1ఎస్, 1క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటమ్ టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటమ్ టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన క్వాంటమ్ రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటమ్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటమ్ వ్యాలీకి దక్కుతుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు -క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీలో కీలకం. ఈ రెండుచోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే మినీ క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్‌లు క్వాంటమ్ ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందిస్తాయి. క్వాంటమ్ కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతోపాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేస్తోంది.

### స్వదేశీ టెక్నాలజీతో రిఫరెన్సు ఫెసిలిటీ

అమరావతిలో ఏర్పాటు చేస్తున్న రెండు క్వాంటమ్ రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశీ ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ 1క్యూ పేరిట క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేసింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటమ్ టెస్ట్ బెడ్‌ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓలాంటి సంస్థల సహకారం ఉంది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ టెస్ట్ బెడ్‌ల ప్రారంభోత్సవానికి నేషనల్ క్వాంటమ్ మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటమ్ రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటమ్ ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరవుతారు.





### తయారీ రంగంలో ముందడుగు:

అమరావతిలో అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుతోపాటు, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయి క్వాంటమ్ కంప్యూటర్లను, విడిభాగాల్ని అక్కడే తయారుచేసి ఎగుమతి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. గత ఏడాది సెప్టెంబరు 9న హార్డ్‌వేర్ విడిభాగాల తయారీదారులతో ముఖ్యమంత్రి జరిపిన సమావేశంలో క్వాంటమ్ విడిభాగాల టెస్టింగ్, వ్యాలిడేషన్, బెంచ్‌మార్కింగ్, సర్టిఫికేషన్ కోసం రిఫరెన్స్ సదుపాయాలు కావాలని కోరారు. అమరావతిలో రిఫరెన్స్ ఫెసిలిటీస్‌ను కల్పించాలన్న నిర్ణయం అప్పుడే జరిగింది. ఈ సదుపాయాలు రావడంతో అమరావతిలోనే క్వాంటమ్ పరికరాలు తయారు చేసేందుకు దేశంలోని పలు సంస్థలు ముందుకొచ్చే అవకాశముంది. మన దేశంలో ప్రస్తుతం కొన్ని సంస్థలు క్వాంటమ్ విడిభాగాలు తయారు చేస్తున్నా, ప్రాసెసర్ల వంటివాటిని టెస్టింగ్ కోసం విదేశాలకు పంపాల్సి వస్తోంది. అమరావతి రిఫరెన్స్ ఫెసిలిటీస్‌తో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ రంగంలో భారత్ పెద్ద ముందడుగు వేయనుంది.

### క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాదు..

అమరావతి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ కోసం తయారు చేసిన క్రయోజెనిక్స్, ప్రిసిషన్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, క్వాంటమ్ గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ పరికరాలు, సదుపాయాలు కేవలం క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకే కాకుండా, రక్షణ, ఆరోగ్య, సెమీకండక్టర్ తయారీవంటి రంగాలకూ ఉపయోగపడతాయన్నది నిపుణులు చెబుతోన్న మాట. క్రయోజెనిక్ సిస్టమ్స్‌ను ఎంఆర్ఐ మెషీన్లు,స్పేస్ అప్లికేషన్లలో వినియోగిస్తారు. ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సెన్సింగ్, రాడార్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌కు ఉపయోగపడుతుంది. క్వాంటమ్‌గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ సదుపాయాలను సెమీకండక్టర్ల తయారీ, డీప్‌టెక్ ఇండస్ట్రియల్ అప్లికేషన్లలో వినియోగిస్తారు.

క్వాంటమ్ కంప్యూటర్‌తో రాష్ట్రానికి కొత్త కళ రానుంది. ఇదే ఊపుతో.. అమరావతిలో వచ్చే డిసెంబరులోగా క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుతోపాటు.. క్వాంటమ్, ఏఐ టెక్నాలజీల పరిశోధనలు, అల్గారిథమ్స్, యూజ్ కేసుల రూపకల్పనలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధ్వర్యంలో "క్వాంటమ్ అండ్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్" పనులు మొదలయ్యాయి. వచ్చే మూడేళ్లలో 100 క్వాంటమ్-ఏఐ అల్గారిథమ్స్, యూజ్ కేసులు అభివృద్ధి చేయడం, 5 వేలమంది విద్యార్థుల్ని క్వాంటమ్ అల్గారిథమ్స్ రాయడంలో నిపుణులుగా తీర్చిదిద్దడం, క్వాంటమ్ టెక్నాలజీపై 600 మందికిపైగా అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం, 100 స్టార్టప్‌లు ప్రారంభమయ్యేలా చూడటం, 100 పత్రాల ప్రచురణ, వందకుపైగా పేటెంట్‌ల సాధన, 50కి పైగా పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని లక్ష్యాలుగా పెట్టుకుంది.



అమరావతి క్వాంటమ్‌వ్యాలీ మిషన్ డైరెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే గవర్నింగ్ కౌన్సిల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలల ప్రొఫెసర్లు, ఐబీఎం సంస్థ ప్రతినిధులు, రాష్ట్రంలోని 380 క్వాంటమ్ ఇన్నోవేషన్ సెల్స్‌నుంచి నలుగురు ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం గన్నవరంలోని మేధాటవర్స్ నుంచి నడిచే క్వాంటమ్ ఇనోవేషన్ సెంటర్ అమరావతిలో భవన నిర్మాణం పూర్తయ్యాక అక్కడి నుంచి పని చేస్తుంది.

### నిమిషాల లెక్కన ఛార్జీ వసూలు

ఐబీఎంవంటి సంస్థలు క్వాంటమ్ కంప్యూటర్లు వినియోగించుకున్నందుకు నిమిషాల లెక్కన ఛార్జీ వసూలు చేస్తాయి. ప్రస్తుతం ఒకేసారి 5,400 నిమిషాల సమయం కొనుగోలు చేస్తే ఐబీఎం నిమిషానికి 48 డాలర్లు వసూలు చేస్తోంది. ఏడాదిలోగా ఆ సమయాన్ని వాడేసుకోవాలి. 10 నిమిషాలు, 20 నిమిషాలు ఇలా తక్కువ సమయం కావాలనుకున్న వారి నుంచి నిమిషానికి 96 డాలర్లు చొప్పున వసూలు చేస్తోంది. ఇలా నిమిషాల లెక్కన కేటాయించే సమయాన్నే క్వాంటమ్ క్రెడిట్స్ అంటారు.

### గంట చొప్పున ఉచితంగా వాడుకునేందుకు:

అమరావతిలో ఏర్పాటు చేసే 133 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ క్వాంటమ్ కంప్యూటర్‌కూ ఐబీఎం ఇవే ధరల్ని నిర్ణయించే అవకాశముంది. అమరావతిలోని క్వాంటమ్ కంప్యూటర్‌ను రోజుకు గంట చొప్పున ఉచితంగా వాడుకునేందుకు అమరావతి క్వాంటమ్ వ్యాలీకి ఐబీఎం అవకాశమివ్వాలన్నది ఒప్పందంలో భాగం. ఐబీఎం ఉచితంగా ఇచ్చే క్వాంటమ్ క్రెడిట్స్‌ను "క్వాంటమ్ అండ్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్" రూపొందించిన అల్గారిథమ్స్‌ను రన్ చేయడం, యూజ్ కేసులు సిద్ధం చేయడానికి వాడతారు.

### క్వాంటమ్ క్రెడిట్స్ కొనుగోలు:

ఐబీఎం ఉచితంగా ఇచ్చే సమయాన్ని వినియోగించుకుంటూ, ఇంకా అవసరమైతే క్వాంటమ్ క్రెడిట్స్‌ను కొంటారు.కేవలం క్వాంటమ్ కంప్యూటర్‌ను తెచ్చి అమరావతిలో పెట్టేస్తే ప్రయోజనం ఉండదని, దాన్ని వాడగలిగేలా అధ్యాపకులు, విద్యార్థుల్ని సిద్ధంచేయాల్సి ఉంటుందని, అధికారుల చెప్తున్నారు. అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్ వచ్చేనాటికి కనీసం 25 అల్గారిథమ్స్‌తో సిద్ధంగా ఉండాలన్నది లక్ష్యంగా ఉంది.

### 108 అంబులెన్స్‌లకు యూజ్‌కేస్:

వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, రవాణా, మెటీరియల్ సైన్స్, ఆర్థిక రంగాలకు 100 క్వాంటమ్-ఏఐ అల్గారిథమ్స్, యూజ్ కేసులు సిద్ధం చేయబోతున్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలు, పరిశ్రమల సమస్యలకు అల్గారిథమ్ రాసి క్వాంటమ్ కంప్యూటర్ ద్వారా పరిష్కారం కనుగొనడాన్నే యూజ్ కేస్ అంటారు. 108 అంబులెన్స్ వాహనాలను, ఏ ప్రాంతాల్లో మోహరిస్తే ప్రజలకు మరింత వేగంగా, మెరుగ్గా సేవలందించవచ్చో ఒక యూజ్ కేస్ తయారు చేయాలని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కోరింది. గడచిన మూడేళ్లలో 108 కాల్‌సెంటర్‌కు ఎన్ని కాల్స్ వచ్చాయి, ఫోన్ వచ్చాక సగటున ఎంత సేపట్లో అంబులెన్స్ ఆ ప్రాంతానికి చేరుతోంది, ఆలోగా బెడ్‌లు, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా? వంటి వివరాలన్నీ తీసుకుని ఇన్నోవేషన్ సెంటర్ యూజ్ కేసు తయారు చేస్తుంది.

"కేవలం క్వాంటమ్ కంప్యూటర్‌ను తెచ్చి అమరావతిలో పెట్టేస్తే గనక ఎలాంటి ప్రయోజనం ఉండదు. దాన్ని వాడుకుని మనం లబ్ధి పొందేందుకు అవసరమైన ఎకో సిస్టం, సామర్థ్యాలనూ అభివృద్ధి పరిచాలి. అధ్యాపకుల్ని, విద్యార్థుల్ని సిద్ధం చేయాలి. ప్రపంచంలో ఎక్కడ క్వాంటమ్ సేవలు అవసరమైనప్పటికీ మనమే అందించే స్థాయికి ఎదగాలి" అన్నది అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ చెబుతోన్న మాట.

క్వాంటం ఏఐ ఇనోవేషన్ సెంటర్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలలకు చెందిన ఎంపిక చేసిన అధ్యాపకులు, స్టార్టప్ కంపెనీలు, రాష్ట్రంలోని 380 క్వాంటమ్ ఇన్నోవేషన్ సెల్స్‌నుంచి కొందరిని భాగస్వాముల్ని చేస్తున్నారు. మొత్తంగా క్వాంటమ్ టెక్నాలజీలకు సంబంధించి పూర్తి ఎకో సిస్టంను రాష్ట్రంలో నెలకొల్పే అత్యద్భుత ప్రయత్నం మహాయజ్ఞంగా సాగుతోంది.



చైతన్యరథం




## యువనేత లోకేష్ హామీ.. రవినాయుడు సంకల్పానికి కార్యరూపం..

# స్పోర్ట్స్ హబ్‌గా తిరుపతి

### జాతీయస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటు
### మంత్రి లోకేష్ చేతుల మీదుగా రేపు ప్రారంభోత్సవం














తిరుపతి: తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీని ఆయన ప్రధాన అనుచరుడు, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు సాకారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 22నెలల్లోనే తిరుపతికి అత్యాధునిక క్రీడా మౌలికసదుపాయాలు అందుబాటు లోకి రానున్నాయి. ఈనెల 15వ తేదీన తిరుపతిలో మంత్రి లోకేష్ చేతుల మీదుగా వీటిని ప్రారంభించను న్నారు. తిరుపతి నడిబొడ్డున అత్యాధునిక హంగులతో రూ.10.20కోట్లతో నిర్మించిన ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీ (క్రికెట్, కబడ్డీ,కోకో, వాలీబాల్ బాల్,బ్యాట్మెంటన్, ఆర్చరీ)కి మంత్రి లోకేష్ ప్రారంభో త్సవం చేస్తారు. ఆ తర్వాత రూ.5.5కోట్లతో కరణం మల్లేశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ, 200మంది క్రీడాకారులకు వసతి సదుపాయం (శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో) నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. నేషనల్ స్టాండర్డ్స్‌తో నిర్మిం చిన బాక్సింగ్ రింగ్ (శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో)ని మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం చంద్రగిరి నియోజకవర్గం శ్రీనివాస మంగాపురంలో రూ.3.20 కోట్లతో నిర్మిం చిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం,క్రీడా ప్రాంగణం, బ్యాడ్మింటన్, హాకీ, చెస్,టేబుల్ టెన్నిస్, కబడ్డీ, కోకో, వాలీబాల్, జిమ్, యోగ కోర్టులను ప్రారంభిస్తారు. వీటితోపాటు గూడూరు నియోజకవర్గం కోట మండ లంలో 2.30 కోట్లతో మల్టీపర్పస్ ఫోర్స్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి, సూళ్లూరులో రూ.2.70 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి, రేణిగుంట మండలంలో 80 లక్షలతో పాఠశాలల్లో క్రీడా సదుపాయాల నిర్మాణాలకు సంబంధించి శిలా ఫలకాలను ఆవిష్కరిస్తారు. దామినేడు వద్ద 28.30 ఎకరాల భూమిని స్పోర్ట్స్ విలేజ్‌కి లాంఛనంగా కేటాయిస్తారు.



### అత్యాధునిక హంగులతో క్రికెట్ స్టేడియం

ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యాన తిరుపతి గోలవనిగుంటలో నిర్మించిన నూతన క్రికెట్ స్టేడియం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 15న మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ఈ స్టేడియాన్ని ప్రారంభించనున్నారు. క్రీడా అభివృద్ధికి తోడ్పడటం, భవిష్యత్ క్రీడాకారులను ప్రోత్సహించడం లక్ష్యం. విశాఖపట్నం స్టేడియం తరహాలోనే ఇక్కడ భారీ ఎల్ఈడీ (LED) స్క్రీన్‌లు, అత్యాధునిక స్కోర్ బోర్డులను అమర్చారు. స్టేడియంలో నిర్మించిన పెవిలి యన్ భవనం చివరి దశ పనుల్లో ఉంది. ఇందులో క్రికెటర్ల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్‌లు, విశ్రాంతి గదులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లను నిర్మించారు. సాధారణ ప్రేక్షకులతోపాటు విభిన్న రంగాల ప్రముఖు లు మ్యాచ్‌లను వీక్షించేందుకు వీలుగా స్టేడియం రెండో అంతస్తులో ప్రత్యేక వీఐపీ గ్యాలరీని ఏర్పాటు చేశారు. సుమారు 65 మందికి పైగా వీఐపీలు కూర్చుని సౌకర్యవంతంగా మ్యాచ్ చూసేలా దీన్ని తీర్చిదిద్దారు. స్టేడియం లోపలి గోడలపై ప్రముఖ క్రికెట్ క్రీడాకారుల చిత్రపటాలను వేయిస్తూ క్రీడా వాతావరణాన్ని ఉట్టిపడేలా చేస్తున్నారు.

### దామినీడులో స్పోర్ట్స్ సిటీకి ప్రణాళికలు

ఆంధ్రప్రదేశ్‌కు అధిక జనాభా, క్రీడా ప్రతిభ ఉన్నప్పటికీ, నిలకడగా అంతర్జాతీయస్థాయి అథ్లెట్లను తయారు చేయగల కేంద్రీకృత, ప్రపంచస్థాయి శిక్షణ, పోటీ వేదికల కొరత ఉంది. ఈ కొరత తీర్చడానికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అకాడమీని తిరుపతిలో నెలకొల్పాలని నిర్ణయించారు. ఇందుకోసం తిరుపతి రూరల్ మండలం, దామినేడు గ్రామంలో 28.37 ఎకరాల భూమి కేటాయింపునకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ద్వారా స్పోర్ట్స్ హబ్‌గా తిరుపతి వ్యూహాత్మక మార్పు చోటు చేసు కుంది. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (SAAP) ఆధ్వర్యంలో అభివృద్ధి చేసే దామినేడు స్పోర్ట్స్ సిటీ దక్షిణ భారతదేశానికి ఒక అత్యుత్తమ క్రీడాకేంద్రంగా రూపుదిద్దుకోనుంది. స్పోర్ట్స్ సిటీ ప్రణాళికలో క్రికెట్ స్టేడియం, అథ్లెటిక్స్ ట్రాక్, ఫుట్‌బాల్, హాకీ మైదా నాలు, స్విమ్మింగ్ కాంప్లెక్స్, విస్తృతమైన ఇండోర్ శిక్షణా సౌకర్యాలు ఉన్నాయి. ముఖ్యంగా, ఇందులో హాస్టళ్లు, కోచింగ్ అకాడమీలు, స్పోర్ట్స్ సైన్స్ సెంటర్లు కూడా ఉన్నాయి. ఇది కేవలం ఈవెంట్-కేంద్రీకృత మౌలిక సదుపాయాల నుండి సంపూర్ణ అథ్లెట్ అభివృద్ధి వ్యవస్థ వైపు జరుగుతున్న మార్పును సూచిస్తుంది. తిరుపతిలో మౌలిక సదు పాయాలను కేంద్రీకరించడం ద్వారా, పట్టణ, గ్రామీణ అథ్లెట్లకు సేవలందించగల ఒక కేంద్రీకృత ప్రతిభా కేంద్రాన్ని సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

దామినేడు స్పోర్ట్స్ సిటీ సమాంతర ప్రాజెక్టులు తిరుపతి క్రీడా వ్యవస్థను బలోపేతం చేయనున్నాయి. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (IISER)లో, వరల్డ్ అథ్లెటిక్స్ నిబంధనలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అథ్లెటిక్స్ ట్రాక్ ఇప్పటికే నిర్మాణంలో ఉంది.









# ఏపీ క్యాబినెట్ ఎజెండా తయారీలో మార్పులు

**- టైమ్‌లైన్స్ విధిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు**
**- ఇక ఈ-క్యాబినెట్ పోర్టల్ ద్వారానే సమాచారం**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాల నిర్వహణలో పారదర్శకత, సమయపాలనను పెంచే దిశగా ప్రభు త్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. క్యాబినెట్ ఎజెండా తయారీ, మెమోల సమర్పణకు సంబంధించి నూతన టైమ్‌లైన్స్‌ను విధిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై క్యాబి నెట్ సమావేశం జరగడానికి ఒకరోజు ముందు ఉదయం 11గంటల లోపు అన్ని శాఖల మంత్రులు/అధికారులు తమ ప్రతిపాద నలను సమర్పించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే ఎటువంటి ప్రతిపాదనలను ఎజెండాలో చేర్చబోమని ప్రభు త్వం స్పష్టం చేసింది. శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీ లించిన అనంతరం ముఖ్యమంత్రి ఆమోదంతో క్యాబినెట్ ఎజెండా ను ఫైనలైజ్ చేస్తారు. అత్యంత అసాధారణమైన లేదా అత్యవస రమైన అంశాలను మాత్రమే ముఖ్యమంత్రి అనుమతితో 'టేబుల్ ఐటమ్స్'గా చివరి నిమిషంలో చర్చకు అనుమతిస్తారు. ప్రభుత్వ రహస్యాల భద్రత, పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని ఎజెండా పంపిణీ విధానంలో పెను మార్పులు చేశారు. ఇకపై క్యాబినెట్ ఎజెండాను వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా గ్రూపుల ద్వారా పంపిణీ చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి సమాచా రాన్ని కేవలం ఈ-క్యాబినెట్ పోర్టల్ ద్వారా మాత్రమే మంత్రులకు, సంబంధిత అధికారులకు అందుబాటులో ఉంచుతారు. గతంలో ఎజెండా తయారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ఈ కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చారు. దీనివల్ల మంత్రులకు కూడా చర్చించాల్సిన అంశాలపై ముందుగానే పూర్తి అవగాహన ఏర్పడే అవకాశం ఉంటుంది. పాలనలో వేగం పెంచడం, సాంకేతి కతను జోడించడం ద్వారా నిర్ణయాల ప్రక్రియను మరింత పటిష్టం చేయడమే ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అన్ని శాఖల కార్యదర్శులు ఈ నూతన మార్గదర్శ కాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం మెమోలో ఆదేశించింది.

## జగన్‌వి శవ రాజకీయాలు

**- జనం ఛీకొట్టినా అమరావతిపై అబద్ధాలు**
**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజం**



అమరావతి (చైతన్యరథం): జగన్‌రెడ్డిపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ఆ నాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని విమ ర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై అబద్ధాలు, మాఫియా అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా? అని ధ్వజమెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే గతి పడుతుందని హెచ్చరించారు.

## ముగిసిన దుర్గగుడి పాలకమండలి సమావేశం

**- పూజా కార్యక్రమాల వీక్షణకు క్యూలైన్‌లో టీవీలు**
**- ఉద్యోగుల ఆరోగ్య సేవలకు ఎంవోయూ**
**- కౌలుకు ఆలయ భూములు.. 37 అంశాలపై చర్చ**



విజయవాడ (చైతన్యరథం): దుర్గగుడి పాలకమండలి సమావే శం ముగిసింది. ఈ సమావేశంలో 37 అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మీడియాతో మాట్లాడుతూ భక్తులకు కల్పించాల్సిన మెరుగైన సౌకర్యాలపై ప్రధా నంగా చర్చించామని తెలిపారు. ఆలయంతో పాటు క్యూలైన్లలోనూ భక్తుల కోసం టీవీలు పెట్టి అమ్మవారి పూజా కార్యక్రమాలు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నా రు. టీవీలు ఇచ్చేందుకు దాతలు ముందుకొచ్చారని వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్యరీత్యా ఓ హాస్పిటల్‌తో ఎంవోయూ చేసుకోబో తున్నామని చెప్పారు. కనకదుర్గానగర్‌లో మరుగుదొడ్లు గంజాయి బ్యాచ్ వాడుతున్నారని తెలిసిందని. ఇకపై అలా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోబోతున్నా మని తెలిపారు. అమ్మవారికి 234 ఎకరాలు ఉన్నాయని... కొన్ని చోట్ల కౌలు జరగడం లేదని.. మరికొన్ని చోట్ల అన్యాక్రాంతమైనట్లు గుర్తించామన్నారు. వాటిపైన ఏం చేయాలనే అంశంపై చర్చించామని దుర్గగుడి చైర్మన్ రాధా కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడు తూ ఇంద్ర కీలాద్రిపై భక్తులకు క్యూలైన్లలో ఇబ్బందులు తలెత్తకుం డా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దుర్గ గుడి అన్నివిధాలా అభివృద్ధి చెందాలన్నారు. కాంట్రా క్టర్లకు బిల్లులు చెల్లించాలని నిర్ణయించినట్లు చెప్పారు. భూములను కౌలుకు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. జూన్ నాటికి లడ్డూ పోటు, అన్నదానం ప్రారంభిస్తామన్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగానే ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడిం చారు.

## సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లతో మేలు

- ఛార్జీలు తగ్గాలంటే పునరుత్పాదక విద్యుత్తే ప్రత్యామ్నాయం
- రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు
- దర్శిలో పీఎం సూర్యఘర్ అమలుకు రూ.50.39 కోట్లు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- దొనకొండ మండలంలో 44 యూనిట్ల ప్రారంభం



దర్శి(చైతన్యరథం): రోజు రోజుకూ పెరుగుతున్న కరెంట్ వాడకం, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు, ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రజలందరూ సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను ఏర్పాటు చేసుకో వాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపుని చ్చారు. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం దొనకొండ మండలం లోని మల్లంపేట కాలనీలో మంత్రి గొట్టిపాటి సోమవారం పర్యటించారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా గ్రామంలోని 44 ఎస్సీ కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల వినియోగాన్ని పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. సబ్సిడీతో కూడిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం ఉంటుందని అన్నారు. మనం వాడుకునే విద్యుత్ ను మన ఇంటిపైనే ఉత్పత్తి చేసుకునే అవకాశం సోలార్ రూఫ్ టాప్ లో ఉందని వివరించారు. ఒక్కో సోలార్ ప్లాంట్‌తో సుమారు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. దర్శి నియోజకవర్గంలో పీఎం సూర్యఘర్ అమలు కోసం రూ.50.39 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు.

**మల్లంపేట పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్**

మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.11 లక్షల వ్యయంతో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. దాత వడ్లమూడి భూపాల్‌ను అభినందించారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు పి4 లో భాగంగా ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఉన్న మరింత మంది ముందుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారశెట్టి పాపారావు, యువ నాయకులు కడియాల లలిత్‌సాగర్ పలువురు పాల్గొన్నారు.

## బనగానపల్లె - అవుకు రోడ్డు విస్తరణకు చర్యలు

**- అధికారులతో పరిశీలించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**
**- తక్షణమే అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశం**



బనగానపల్లె(చైతన్యరథం): రాష్ట్రంలో రహదారి మౌలిక వసతు ల అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణం మధ్య ఉన్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్-544డి)ను 4 లైన్లుగా విస్తరించే దిశగా ప్రభు త్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం 2 లైన్లుగా ఉన్న ఈ రహ దారి పెరుగుతున్న రవాణా భారాన్ని దృష్టిలో ఉంచుకుని విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇటీవల ఢిల్లీలో కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శిని కలిసి ప్రత్యేకంగా విన్నవించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారుల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి రహదారిని స్థలంలో పరిశీలిం చారు. రహదారి విస్తరణ, భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. వన్ టైం ఇంప్రూవ్‌మెంట్ పథకం కింద తక్షణమే రహదారి అభివృద్ధి పనులు చేపట్టా లని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## ఉగ్ర లింకుల కేసులో నిందితులకు ముగిసిన కస్టడీ

**- రాజమండ్రి జైలుకు తరలింపు**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో కలకలం రేపిన ఉగ్రవాద సంబంధాల కేసులో ఆరుగురు నిందితుల పోలీస్ కస్టడీ నేటితో ముగిసింది. గత ఐదురోజులుగా పోలీసుల విచారణలో ఉన్న నిందితులను అధికారులు క్షుణ్ణంగా ప్రశ్నించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం. నిందితులను ఐదురోజుల పాటు ప్రత్యేక బృందాలు విచారించాయి. ఈ విచారణలో ప్రధానంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ల ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ఎలా వ్యాప్తి చేస్తున్నారు? ఎవరెవరిని సంప్రదిస్తున్నారు? అనే అంశాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఈ కార్యకలాపాలకు నిధులు ఎక్కడి నుంచి అందుతున్నాయి? విదేశీ లింకులు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ సాగినట్టు సమాచారం. వారి తదుపరి ప్రణాళికలు ఏమిటి? రాష్ట్రంలో ఏవైనా విధ్వంసకర చర్యలకు ప్లాన్ చేశారా? అన్న విషయాలపై పోలీసులు ప్రశ్నలు కురిపించారు. కస్టడీ గడువు ముగియడంతో పోలీసులు నింది తులను వైద్యపరీక్షల అనంతరం విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. నిందితుల నుంచి సేకరించిన ప్రాథమిక ఆధారాలను, విచారణ నివేదికను పోలీసులు న్యాయమూర్తికి సమర్పించారు. పోలీసుల వాదనలను విన్న న్యాయస్థానం నిందితులకు ఏప్రిల్ 20 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీ సులు వారిని తిరిగి జైలుకు తరలించారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం నిందితుల డిజిటల్ పరికరాలను (ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు) ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలుస్తోంది.

చైతన్యరథం

# 20న అప్పన్న చందనోత్సవం

### ఏర్పాట్లను పర్యవేక్షించిన హోంమంత్రి అనిత



విశాఖపట్నం(చైతన్యరథం): సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామిని హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం దర్శించు కున్నారు. ఆలయ మర్యాదలతో అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 20న సింహాచలం అప్పన్న స్వామివారి చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు మౌలిక వసతులు, పార్కింగ్‌పై అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అప్రమ త్తంగా ఉండాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌డీఆర్ ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఆలయం వద్ద ఉండాలని సూచిం చారు. సీసీ టీవీ కెమెరాలు ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేయాలని, ఏఐ టెక్నాలజీని ఉపయో గించాలని ఆదేశించారు. పెద్ద సంఖ్యలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు భక్తు లకు ఇవ్వాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ చందనోత్సవం ఒక అపురూపమైన ఘట్టం. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్వామి వారి నిజరూప దర్శనానికి వస్తారు. చందనోత్సవం ఏర్పాట్లపై ఇటీవల మంత్రుల బృందం కూడా సమీక్షించాం. సామాన్య భక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. గత సంవత్సరం స్వామి వారి చందనోత్సవానికి 1.20 లక్షల మంది భక్తులు వచ్చారు. ఈ సంవత్సరం 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. తెల్లవారుజామున మూడు గంటల నుంచి స్వామివారి దర్శనాలు ప్రారంభమవుతాయి. పది చోట్ల మెడికల్ క్యాంపులు, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ఏర్పాటు చేస్తున్నాం. రెండు గంటలు మాత్రమే అంతరాలయం దర్శనాలు ఉంటాయి. తెల్లవారుజామున ఐదు గంటల తర్వాత అంతరాలయ దర్శనాలను నిలిపివేస్తున్నామని తెలిపారు. ఏర్పాట్లు పర్యవేక్షణలో పాల్గొన్న విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సింహా చలం ఆలయం ఈవో వెంకటరావు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం

- గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మనందరి బాధ్యత
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



విశాఖపట్నం (చైతన్యరథం): తల్లీబిడ్డల సంక్షేమమే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని, రాష్ట్రం నుంచి పోషకాహార లోపాన్ని తరిమికొట్టడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలో ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ పరిధిలో నిర్వహించిన 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం కేవలం ఒక ఆరోగ్య కార్యక్రమం మాత్రమే కాదని, అది మన రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే సామాజిక బాధ్యత. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి' అని కొనియాడారు. శిశువు గర్భంలో పడిన నాటి నుంచి రెండేళ్లు నిండే వరకు ఉండే మొదటి వెయ్యి రోజుల కాలం ఆ బిడ్డ దీర్ఘకాలిక ఆరోగ్యానికి ఎంతో కీలకమని పల్లా వివరించారు. ఈ సమయంలో తల్లులకు పోషకాహారం అందేలా చూడటం ద్వారానే ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించగలమని చెప్పారు. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రతి ఇంటికీ పోషకాహార ప్రాముఖ్యతను చేరువ చేస్తున్నామని తెలిపారు.

**జంక్ ఫుడ్ వద్దు.. ఇంటి భోజనమే ముద్దు**

దేశవ్యాప్త లక్ష్యంలో భాగంగా ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించాలని ఆయన కోరారు. మన పాతకాలపు ఇంటి భోజనం, సంప్రదాయ ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 3 నుంచి 6 ఏళ్ల వయసులో పిల్లల మేథో వికాసం వేగంగా జరుగుతుందని, తల్లిదండ్రులు పిల్లలతో సమయాన్ని గడుపుతూ కథలు చెప్పడం, ఆటలాడటం వంటివి చేయాలని సూచించారు.

కుటుంబ ఆరోగ్య విషయాల్లో పురుషులు కూడా చురుగ్గా పాల్గొని అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'పోషణ్ పక్వాడా' వంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆస్తిపన్ను చెల్లింపుదారులకు గుడ్‌న్యూస్

### పట్టణ ప్రాంతాల్లో 50 శాతం రాయితీ

అమరావతి (చైతన్యరథం): పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం(ప్రిన్సిపల్) పూర్తిగా చెల్లించి మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తిపన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి. సీడీఎమ్ఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30, 2026 వరకు మాత్రమే ఉండనుం ది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించే వారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలి టీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లిం చి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## శ్రీరాముని విగ్రహానికి 'స్వస్తి' కార్యక్రమం

- కోటిపల్లి తీరంలో శాస్త్రోక్తంగా నిమజ్జనం
- పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం (చైతన్యరథం): జిల్లాలోని రామతీర్థం కొండపై ఉన్న పురాతన శ్రీరాముని విగ్రహం గత ప్రభుత్వ హయాంలో గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ధ్వంసమవడంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ ఘటనపై అప్పట్లో దర్యాప్తు కూడా జరిగింది. శ్రీరాముని విగ్రహానికి సంబంధించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గుర్తు తెలియని దుండ గుల చేతిలో ధ్వంసమైన పురాతన శ్రీరాముని విగ్రహానికి సంబంధించి శాస్త్రోక్తంగా 'స్వస్తి' కార్యక్రమం నిర్వహించారు. రామతీర్థంలోని కోటిపల్లి తీరంలో శ్రీరాముని విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఒక భావోద్వేగ ఘట్టంగా మారింది. భక్తుల మనోభా వాలను గౌరవిస్తూ శాస్త్రోక్తంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరపున పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రామతీర్థం కొండపై ఉన్న విగ్రహం గతంలో జరిగిన దాడిలో విరిగిపోయి, దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో దానిని సంప్రదాయ పద్ధతుల్లో గౌరవంగా నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కోటిపల్లి తీరానికి విగ్రహ భాగాలను తరలించి శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. రామతీర్థం విగ్రహ నిమజ్జన అనంతరం, సింహాచలం, అనకాపల్లి, అన్నవరం దేవస్థానాల వద్ద కూడా ప్రత్యేక పూజలు నిర్వహించేం దుకు అర్చకులు, భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తి భావంతో కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, నాగమాధ వి, ఈశ్వరరావు, మార్కెఫెడ్ చైర్మన్ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పాలకొల్లు(చైతన్యరథం): పాలకొల్లు నియోజకవర్గంలో రూ. 9.22 కోట్లతో మంత్రి నిమ్మల రామానాయుడు అభివృద్ధి పనుల కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని అధిగమిస్తూనే సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు నెరవేరుస్తున్నారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. రాష్ట్రానికి పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలు క్యూ కడుతుంటే జగన్ ఓర్వలేక పోతున్నాడు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది గొడ్డలి పార్టీ. ప్రతిఒక్కరి ఓటు అభివృద్ధి వైపు ఉండాలి గాని విధ్వంసం వైపు కాదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు విధ్వంసం తప్ప అభివృద్ధిని చూడలేదని మండిప డ్డారు.

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

- పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైంది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేశామని తెలిపారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. గతంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాద నలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆది వారం సాయంత్రం తిరుపతి నుంచి బయలుదేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయలు దేరుతుంది.

## ఫిషింగ్ హార్బర్‌పై నీచ రాజకీయం సిగ్గుచేటు

- నెల్లూరు ఎందుకు వెళుతున్నారో జగన్ చెప్పాలి
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

అమరావతి (చైతన్యరథం): జగన్ నెల్లూరు ఎందుకు వెళు తున్నారో చెప్పాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి డిమాండ్ చేశారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై వైసీపీ నీచ రాజకీయం సిగ్గుచేటు అని మండిపడ్డారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ని రూ.288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేశాం. జువ్వలదిన్నెలో అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఇది దేశీయ రక్షణ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం, దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాల అభివృ ద్ధికి దోహదపడుతుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ హార్బర్ ద్వారా ప్రతి ఏటా 41 వేల టన్నుల చేపలు దిగుబడి చేసే అవకాశం ఉంది. పోర్టులో కొత్త నిర్మాణాలు లేకుండా నాడు వైఎస్ అడ్డగోలుగా జీవోలిచ్చి కృష్ణపట్నం పోర్టు అభివృద్ధిని అడ్డుకున్నారని తెలిపారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ఆ జీఓలన్నీ రద్దు చేసి పోర్టు, హార్బర్ నిర్మాణాలకు మార్గం సుగమం చేశారన్నారు.

# గౌరీశ్వర ఆలయ పునర్నిర్మాణం ప్రారంభం

**- శంకుస్థాపన చేసిన మంత్రి కందుల దుర్గేష్**
**- ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని హామీ**



నిడదవోలు (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామంలో గౌరీశ్వర స్వామి వారి నూతన దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమం సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. శంకుస్థాపనకు మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతా విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "మోర్త గ్రామంలో కొలువుదీరుతున్న ఈ గౌరీశ్వర స్వామి ఆలయం భవిష్యత్తులో ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతుందని, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభు త్వం తరపున ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అంది స్తామని భరోసానిచ్చారు. ఇప్పటివరకు మోర్త గ్రామ అభివృద్ధికి రూ. 4.14 కోట్ల నిధులు వెచ్చించామని తెలిపారు.



**పార్టీ శ్రేణుల కుటుంబాలకు పరామర్శ**

జనసేన అంకితభావం కలిగిన నాయకులను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇటీవల మరణించిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబసభ్యులను సోమవారం మంత్రి దుర్గేష్ వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు. తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు నూతంగి సత్యానందం కుటుంబసభ్యులను, రావిమెట్ల గ్రామంలో ఆచంట సత్తిబాబు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇటీవల కన్నుమూసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తాటి బెల్లం సహకార ఫెడరేషన్ అధ్యక్షులు బొల్లా ముసలయ్య గౌడ్ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

# ఇకపై 'నిధి' పోర్టల్‌లోనే పెన్షన్ ప్రాసెసింగ్

**- ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ**
**- మే 1 నుంచి కొత్త విధానం అమలు**




అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి (నిధి) పోర్టల్ (ఆర్‌బీపీఎస్) ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధి కారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వా త వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభు త్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యం గా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నా యి. ఫైల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవ చ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవ ర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సేవలు అందుతా యి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిం ది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరు లో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం.

# టీడీపీ ప్రభుత్వంలోనే హజ్ కమిటీకి నిజమైన స్వేచ్ఛ

- **హజ్ కమిటీపై సాక్షి పత్రిక ప్రచారం అంతా అబద్ధం**
- **చిన్న టెక్నికల్ అంశాన్ని భూతద్దంలో చూపి రాజకీయం చేస్తున్న వైసీపీ**
- **హజ్ కమిటీ పవిత్రతను దెబ్బతీసేలా అసత్య కథనాలు ప్రచురించడం నీచం**
- **ముస్లింల మనోభావాలతో ఆడుకోవడం వైసీపీకి పరిపాటిగా మారింది**
- **నాడు కడపలో నిర్మించిన హజ్ హౌస్‌ను వైసీపీ ప్రభుత్వం కొవిడ్ సెంటర్‌గా మార్చి నిర్వీర్యం చేసింది**
- **రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారు ఎంఏ షరీఫ్**



మంగళగిరి (చైతన్యరథం): హజ్ కమిటీ నియామకాలపై సాక్షి దినపత్రికలో వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. కోడిగుడ్డు మీద ఈకలు పీకే చందంగా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ముస్లింలను తప్పుదోవ పట్టించేలా ఆ వార్తలు ఉన్నాయని విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికుల సౌకర్యార్థం, హజ్ యాత్ర పట్ల పవిత్ర భావన, అనుభవం ఉన్న వ్యక్తులతోనే కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో ఎటువంటి దురుద్దేశం లేదు. గత జీవో నెం.38లో కొన్ని సాంకేతిక అంశాలకు సంబంధించి హైకోర్టులో పిటిషన్ దాఖలైన మాట వాస్తవం. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించే మా ప్రభుత్వం ఆ లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దింది. పాత జీవోలోని సభ్యులను కొనసాగిస్తూనే నిబంధనల ప్రకారం కొత్త జీవో జారీ చేసింది. ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. స్థానిక సంస్థల కోటాలో ఎన్నికైన కొందరు సభ్యుల పదవీ కాలం ముగిసిన మాట వాస్తవం. అయితే వారి స్థానంలో కొత్తవారిని నియమించాలా లేదా వారు కొనసాగాలా అనేది పూర్తిగా చట్టపరమైన, సాంకేతికపరమైన ప్రక్రియ. దీనికి సంబంధించి అధికారులు నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. ఈ చిన్న అంశాన్ని ఏదో కొంపలు అంటుకున్నట్టు, హజ్ పవిత్రతకు భంగం కలిగినట్టు చిత్రీకరించడం హాస్యాస్పదం. ముగ్గురు సభ్యుల విషయంలో సాక్షి పత్రిక తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోంది. ఇద్దరి పదవీ కాలం ముగిస్తే మరొకరికి సెప్టెంబరు వరకు సమయం ఉంది' అన్నారు.

'వాస్తవాలు ఇలా ఉంటే ముస్లిం మనోభావాలను రెచ్చగొట్టి తెలుగుదేశం ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా వైసీపీ పబ్బం గడుపుకోవాలని చూస్తోంది. హజ్ కమిటీలో సభ్యుల పదవీ కాలంపై సాక్షి పత్రిక, వైసీపీ నేతలు చేస్తున్న యాగీ చూస్తుంటే వారికి ముస్లింల సంక్షేమం కంటే రాజకీయ లబ్ధిపైనే ఆరాటం ఎక్కువని అర్థమవుతోంది. అధికారుల స్థాయిలో నిబంధనల ప్రకారం జరగాల్సిన ఒక సాంకేతిక ప్రక్రియను పట్టుకుని హజ్ పవిత్రత దెబ్బతిన్నట్లు కలరింగ్ ఇవ్వడం ముస్లిం సమాజాన్ని అవమానించడమే. ప్రభుత్వంలో ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు ఫైల్ సర్క్యులేషన్, నిబంధనల పరిశీలన వంటి ఒక పద్ధతి ఉంటుంది. ముగ్గురు సభ్యుల పదవీ కాలం ముగిసిందని ఆరోపిస్తున్న వారు.. అది చట్టపరంగా పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందని ఎందుకు విస్మరిస్తున్నారు? ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూపిస్తూ ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నా'రన్నారు.

**మీరా నీతులు చెప్పేది!**

ముస్లింల పట్ల ఎవరికి ప్రేమ ఉందో చరిత్ర చెప్తుంది. ఆనాడు హైదరాబాద్ నాంపల్లిలో 11 అంతస్తుల భారీ హజ్ హౌస్‌ను నిర్మించింది నారా చంద్రబాబునాయుడు. నేటికీ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక యాత్రికులు కూడా అక్కడి నుండే ప్రయాణం అవుతున్నారు. ఇది మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. రాష్ట్ర విభజన తర్వాత రాయలసీమ ముస్లింల కోసం కడపలో 12 ఎకరాల వక్ఫ్ భూమిలో రూ.25 కోట్లతో అద్భుతమైన హజ్ హౌస్, మసీదు నిర్మిస్తే.. వైసీపీ పాలనలో దాన్ని ఎలా చూసుకున్నారు? హజ్ హౌస్‌ను కొవిడ్ సెంటర్‌గా మార్చి గాలికి వదిలేశారు. మా హయాంలో ఖర్చు పెట్టిన ఆ రూ. 25 కోట్లు తప్ప మీరు ఒక్క పైసా అదనంగా ఖర్చు చేయలేదు. మీ నిర్లక్ష్యం వల్ల అది అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, వైర్లు... చివరకు ద్వారబంధాలను కూడా ఎత్తుకుపోతుంటే, తగులబెడుతుంటే మీ నాయకులు ఎక్కడ పడుకున్నారు? ఆనాడు మసీదు పవిత్రతను, హజ్ హౌస్ ఆస్తులను కాపాడలేని మీరు.. ఈరోజు ఒక సాంకేతిక అంశాన్ని పట్టుకుని "హజ్ పవిత్రత" గురించి నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం హజ్ హౌస్ నిర్మాణం, ఉద్యోగుల జీతాల కోసం ఏటా రూ.15 కోట్లు కేటాయించింది. ఆ రకంగా నిల్వ ఉన్న రూ.23. 40 కోట్లను హజ్ కమిటీ నిధులను మీ ఐదేళ్ల పాలనలో వాడుకుని పబ్బం గడుపుకున్నారే తప్ప మీ సొంతంగా ప్రభుత్వం నుండి ఒక్క పైసా ఇచ్చింది లేదు. విజయవాడ భవానీపురంలో 3 ఎకరాల స్థలంలో 80కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక హజ్ హౌస్ నిర్మించడానికి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. టెండర్లు పిలిచే దశలో ఉంటే మీరు అధికారంలోకి వచ్చి ఆ ప్రాజెక్టును గాలికి వదిలేశారు. ఐదేళ్లలో కనీసం కోటి రూపాయలు కూడా ఇవ్వకుండా 90 లక్షలతో కాలక్షేపం చేసిన మీరా ఈరోజు హజ్ పవిత్రత గురించి మాట్లాడేది?

**ముస్లిం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారు**

హైదరాబాద్‌లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ కోసం 250 ఎకరాల స్థలం ఇచ్చింది చంద్రబాబు నాయుడు. విభజన తర్వాత కర్నూలు (ఓర్వకల్లు)లో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటుకు 80 కోట్లు కేటాయించి, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణాన్ని వేగవంతం చేస్తే.. దాన్ని మధ్యలోనే ఆపి ముస్లిం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంది మీరు కాదా? హజ్ హౌస్ ఉద్యోగులకు కనీసం జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేని మీ దుస్థితిని ముస్లిం సమాజం గమనిస్తూనే ఉంది. మా ప్రభుత్వం పొదుపు చేసిన డబ్బుతో, దాని మీద వచ్చిన వడ్డీతో కాలం వెళ్లదీసిన చరిత్ర మీది. చంద్రబాబు అమలు చేసిన విదేశీ విద్య, దుల్హన్ పథకం, మసీదుల నిర్మాణం, ఈద్గా, కబరస్థాన్‌ల ప్రహరీ గోడల నిర్మాణ కార్యక్రమాలన్నింటినీ మీరు గాలికొదిలేశారు. గతంలో మేము సుమారు 250 షాదీఖానాలు నిర్మిస్తే వాటిని పూర్తి చేయడానికి కూడా మీకు మనసు రాలేదు. హజ్ కమిటీ అకౌంట్‌లో మేము పొదుపు చేసిన 23కోట్ల 40లక్షల రూపాయలను మీరు మీ రాజకీయ అవసరాలకు వాడుకున్నారు తప్ప హజ్ యాత్రికుల కోసం కొత్తగా చేసింది శూన్యం. కనీసం హజ్ హౌస్ సిబ్బందికి జీతాలు కూడా సరిగ్గా ఇవ్వలేని దుస్థితి మీది. హజ్ కమిటీ సభ్యుల విషయంలో నిబంధనల ప్రకారం అధికారులు నిర్ణయం తీసుకుంటారు. ఎవరైనా సంఘాలకు అనుమానాలు ఉంటే ముఖ్యమంత్రిని లేదా హజ్ కమిటీ సీఈవోని కలిసి మాట్లాడవచ్చు. ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. కానీ సాక్షి పత్రికలో అసత్యాలు రాసి బురద జల్లడం మీ అసహనానికి పరాకాష్ట. మైనారిటీలను దగా చేసి, వారి సంక్షేమ నిధులు తిన్న మీరు.. ఇప్పుడు నక్క విన యాలు ప్రదర్శిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదం. రాజకీయ లబ్ధి కోసం ముస్లిం మనోభావాలతో ఆడుకోవద్దు. ఏదైనా సమస్య ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప అసత్య ప్రచారాలతో సమాజంలో అశాంతి రేపాలని చూస్తే ముస్లిం లే మీకు బుద్ధి చెప్తారని షరీఫ్ హెచ్చరించారు.

# వైసీపీ నేతల అకృత్యాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

- నల్లమాడ భూ వివాదంలో వైసీపీ నాయకుల బరితెగింపు... ఇంటిపై జేసీబీలతో దాడి
- పెళ్లి పేరుతో జడ్పీటీసీ మేనల్లుడి అకృత్యాలు... న్యాయం అడిగితే చంపేస్తామంటూ బెదిరింపులు
- రాజకీయ కక్షతో రికార్డులు తారుమారు చేసి భూమి ఆక్రమణ
- టీడీపీ కార్యకర్తవు... మమ్మల్ని ఏం చేయలేవంటూ వేధింపులు
- అర్జీలు స్వీకరించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ
- సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌కు చెందిన బద్దల మల్లెకొండయ్య అర్జీ... నాతో పాటు ఏడు పేద కుటుంబాల వారం కలిసి 1998లో గోపవరం మండలంలోని సర్వే నెం. 857/3(డి)లో నివేశన స్థలాలు కొనుగోలు చేశాం. మా పేరున డాక్యుమెంట్ నెం.2150/98 (తేదీ:16/10/1998) ద్వారా రిజిస్ట్రేషన్ జరిగింది. గత ప్రభుత్వ హయాంలో స్థానిక వైసీపీ నాయకులు రాచపూటి సాయి, జయరాంనాయుడు ఆ భూమిని ఆక్రమించుకున్నారు. ఈ అన్యాయంపై ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేశారు. అప్పట్లో అధికారులను కలిసి మొరపెట్టుకున్నా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారు పట్టించుకోలేదు. ఫలితంగా బలహీనవర్గాలకు చెందిన మా ఎనిమిది కుటుంబాలు భూమిపై హక్కులు కోల్పోయాం. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

సత్యసాయి జిల్లా నల్లమాడకు చెందిన రవీంద్రనాథ గుప్తా విజ్ఞప్తి... కదిరి–పుట్టపర్తి ప్రధాన రహదారికి ఉత్తర దిశలో మా పూర్వీకుల ఆస్తి సర్వే నెం.270–1 (విస్తీర్ణం 8.01 ఎకరాలు)లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాను. గతంలో ఉన్న పాత స్నానాల గది, టాయిలెట్ స్థానంలో కొత్తగా నిర్మాణం చేపడుతుండగా.. 15–03–2025 నాడు సాయంత్రం సుమారు 4.30గంటల సమయంలో స్థానిక వైసీపీ నాయకులైన టీడీ రఘు నాథరెడ్డి, టీడీ కేశవరెడ్డి, ముద్దిరెడ్డి సోమిరెడ్డి, రవిచంద్రారెడ్డి, కొక్కంటి మంజునాథ రెడ్డి, వారి అనుచరులు జేసీబీలతో నేను ఇంట్లో లేని సమయంలో ప్రవేశించారు. నిర్మాణంలో ఉన్న పునాదులను పెకలించి వేస్తుండగా నా భార్య, కుమారుడు అడ్డుకోబోయారు. సదరు వ్యక్తులు వారిపై దాడి చేసి పక్కకు తోసివేసి ప్రాణహాని తలపెడతామని బెదిరించారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన ప్రియ వినతి... నాకు 2025లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాపట్ల జిల్లా కర్లపాలెం నివాసి పిట్టు ఉమామహేశ్వరరెడ్డి పరిచయమయ్యాడు. తనకు పెళ్లి కాలేదని అబద్ధం చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి నన్ను శారీరకంగా వాడుకున్నాడు. వ్యాపారం పేరుతో నా వద్ద రూ.7లక్షలు తీసుకున్నాడు. అతడికి అప్పటికే పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలుసుకుని నా డబ్బు తిరిగి ఇవ్వాలని కోరగా బాపట్ల రమ్మని పిలిపించాడు. బాపట్ల బాదాం పాలు సెంటర్ వద్దకు నేను కుమార్తెతో కలిసి వెళ్లగా, నేను కారు దిగిన సమయంలో ఆ వ్యక్తి కారులో ఉన్న నా కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ప్రైవేట్ పార్ట్స్‌పై చేయివేసి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ అకృత్యంపై ప్రశ్నించిన నన్ను ఉమామహేశ్వరరెడ్డి మావయ్య, కర్లపాలెం జడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి రాజకీయ పలుకుబడితో బెదిరించాడు. చంపేస్తామంటూ కులం పేరుతో దూషిస్తూ రౌడీలతో దాడులు చేయిస్తామని ప్రాణహాని తలపెట్టారు.

పల్నాడు జిల్లా మాచవరం మండలం తిరకాపాలెం గ్రామానికి చెందిన పెద్ద హుసేన్ వలీ అభ్యర్థన... మా పూర్వీకుల నుంచి సంక్రమించిన 9 ఎకరాల 10 సెంట్ల భూమి ఉంది. ఖాతా నెం.836. సర్వే నెం.247/33 (.05 ఎకరాలు, 247/34 1.51 ఎకరాలు, 247/35–2A 1.16 ఎకరాలు, 247/38–2 1.25 ఎకరాలు. గత ప్రభుత్వ కాలంలో మాచవరం తహసీల్దార్ ఎన్నయ్య, సర్వేయర్ వెంకటరావు అధికార దుర్వినియోగానికి పాల్పడి నా పేరిట ఉన్న రికార్డులను మార్చేశారు. నెం.836 తొలగించి వారికి అనుకూలమైన వ్యక్తి పేరిట కొత్త ఖాతా సృష్టించారు. అధికారులను ప్రశ్నించగా "నువ్వు టీడీపీ కార్యకర్తవు.. మమ్మల్ని ఏమీ చేయలేవు" అని హేళన చేస్తూ బెదిరింపులకు గురిచేశారు.

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన కడలి ధనలక్ష్మి అర్జీ... కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో నా భర్త పద్మరాజు 2012లో రిజిస్టర్ నెం. 4374/2012 ద్వారా రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో 1.06 ఎకరాలను 2015లో విక్రయించగా మిగిలిన 0.94 ఎకరాల భూమి మా స్వాధీనంలో ఉంది. మిగిలిన స్థలాన్ని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుండగా ఇంతేరు గ్రామానికి చెందిన కానూరి పెద్దిరాజు, గురజాల రాము, గురజాల శ్రీరాములు, చింతా సంపతరావు, కొల్లాటి శ్రీనివాసరావు, చింతా ఏసుబాబు, చింతా నాగరాజు 2019 నుంచీ అడ్డుపడుతున్నారు. ఈ విషయంపై అప్పటి నుంచీ కలెక్టర్‌కి పలుమార్లు ఫిర్యాదు చేశాను. ఇటీవల మా భూమి వద్దకు వెళ్లగా బూతులు తిడుతూ మాపై భౌతిక దాడికి దిగారు. చంపుతామని బెదిరిస్తూ తీవ్రంగా గాయపరిచారు.

అన్నమయ్య జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకుల పల్లి గ్రామానికి చెందిన దేవరింటి రవి వినతి... మా గ్రామంలో సర్వే నెం.100/2లో నా పేరున 1.68 ఎకరాలు (ఖాతా నెం:815), దేవరింటి కవిత పేరున ఒక ఎకరం (ఖాతా నెం:5025) పట్టా భూమి ఉంది. ఇందులో మేము బోరు వేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నాం. మా భూమి పక్కనే పొలం ఉన్న ఆలకం వెంకటస్వామి, ఆలకం నరసింహులు వారి కుటుంబ సభ్యులు కలిసి మా పొలంలోకి వెళ్లకుండా దారులన్నీ మూసివేసి కంచె వేశారు. సదరు వ్యక్తులు సర్వే నెం.100/1లోని 1.80 ఎకరాలు, సర్వే నెం.559లోని 1.50 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించి వారి స్వాధీనంలో ఉంచుకున్నారు. ఆ ప్రభుత్వ భూమి గుండా మేము మా పొలంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నా రు. అధికారులను ఆశ్రయించగా వారు దారి చూపించేందుకు జేసీబీతో వచ్చినప్పుడు.. ఆక్రమణదారులు జేసీబీకి అడ్డుగా పడుకుని అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. మాకు అనుకూలం కాని మరో దారి గుండా వెళ్లమని వేధిస్తున్నారు.

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం బావికాడపల్లె గ్రామానికి చెందిన సావిత్రమ్మ అర్జీ... కొమ్మి కృష్ణయ్యనాయుడు 40 ఏళ్ల క్రితం చనిపోయారు. అప్పటి కరణం మా గ్రామంలోని సర్వే నెం.454ను సబ్ డివిజన్ చేసి నాకు రెండెకరాల పొలానికి పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చారు. అప్పటి నుంచీ ఆ భూమిని సాగు చేసుకుంటున్నాను. గత రెండు, మూడేళ్లుగా అనారోగ్యం వల్ల, నీరు లేక పంట వేయలేకపోయాను. నాకు అక్షర జ్ఞానం లేకపోవడంతో ఆ భూమిని ఆన్‌లైన్ చేయించుకోవాలనే విషయం తెలియలేదు. ఇటీవల ఆన్‌లైన్ కోసం తహసీల్దార్‌ని సంప్రదించగా మీ భూమి వివరాలు అడంగల్‌లో మాత్రమే ఉన్నాయి, డి–కెట్ రిజిస్టర్‌లో లేవు అని చెప్తూ ఆన్‌లైన్ చేయడానికి నిరాకరిస్తున్నారు.

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం మీదజంగంపల్లికి గంధం రవిబాబు వినతి... రెడ్డివారిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 817, 36, 37/11, 37/12లో నాకు పిత్రార్జితంగా వచ్చిన నాలుగు ఎకరాల భూమి ఉంది. దానిపై నా దాయాదులైన నారప్ప, హరిబాబు, బాలాజీ, రమేష్, గంధం రామానాయుడు, ఏనుగొండ సుబ్రమణ్యం కన్నేశారు. నేను పొలంలో పనులు చేసుకుంటున్న సమయంలో వారు గుంపుగా వచ్చి విచక్షణారహి తంగా దాడి చేసి రక్తగాయాలు చేశారు. కష్టపడి సాగు చేసిన పంటలోకి పశువులను తోలి సర్వనాశనం చేస్తూ ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు. ఈ దౌర్జన్యాలపై పోలీసులను ఎన్నిసార్లు ఆశ్రయించినా, నిందితుల రాజకీయ ప్రభావంతో ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

మార్కాపురం జిల్లా రాచర్ల మండలం అచ్చంపల్లెకి చెందిన పెద్దిరాజు వినతి... 19.08.2024న మార్కాపురానికి చెందిన ముద్దన హరికృష్ణ వద్ద నాతో పాటు మరో ముగ్గురు కలిసి రూ. 37 లక్షలు అప్పుగా తీసుకున్నాం. నెమిలికంట్లలో 70 సెంట్లు, కర్లపూడిలో 30 సెంట్లు భూమిని 2 రూపాయల వడ్డీకి ఒప్పందం కుదుర్చుకుని మేమే రిజిస్ట్రేషన్ ఖర్చులు భరించి తనఖా పెట్టాం. ఒప్పందం ప్రకారం రెండు నెలల తర్వాత అసలు రూ.20లక్షలు, వడ్డీ రూ.లక్ష మొత్తం రూ.21లక్షలు చెల్లించాం. అప్పుడు 30 సెంట్ల భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తర్వాత లెక్కల ప్రకారం మిగిలిన అసలు రూ.17లక్షలు, వడ్డీ రూ.2.72 లక్షలు చెల్లించాల్సి ఉంది. అయితే అప్పు ఇచ్చిన వ్యక్తి తన పలుకుబడిని ఉపయోగించి మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసి బ్లాక్‌మెయిల్ చేస్తూ సక్రమంగా చెల్లించాల్సిన మొత్తం కంటే అదనంగా రూ. 13లక్షలు బలవంతంగా లాక్కున్నారు. ఈ అన్యాయంపై ఎస్పీ, డీఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా మాకు సరైన న్యాయం జరగలేదు.

పల్నాడు జిల్లా క్రోసూరుకు చెందిన రవి శంకర్‌బాబు అర్జీ... నా తండ్రి బండారు తిరుపతయ్య తన స్వార్జితంతో సంపాదించిన భూమిని నా పేరిట 2015లో గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. సర్వే నెం. 77–3బూ,దీలో 0.9800 ఎకరాలు, సర్వే నెం. 77–3బూ3లో 0.6900 ఎకరాలు. ఈ భూమి 27–07–2015న నా పేరిట అధికారికంగా రిజిస్ట్రేషన్ అయ్యింది. అయితే 20 ఏళ్లుగా గుంటూరులో నివసిస్తూ వ్యాపారం చేసుకుంటున్నాను. క్రోసూరులోని నా భూమిని 2015 నుంచి ఇతరులకు కౌలుకు ఇస్తూ సాగు చేయిస్తున్నాను. గత నాలుగైదు నెలలుగా జాస్తి హరిబాబు అనే వ్యక్తి నా భూమిలోకి అక్రమంగా చొరబడి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే నన్ను కొట్టడానికి ప్రయత్నించడమే కాకుండా నన్ను, నా కుటుంబాన్ని చంపేస్తానని తీవ్రంగా బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

పై వాటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని ఇంకొందరు అభ్యర్థనలు అందించారు.

# పురపాలక ఎన్నికలకు సన్నాహాలు

- మొదలైన డివిజన్లు, వార్డుల పునర్విభజన
- రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాల ప్రచురణకు కసరత్తు

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు మొదలయ్యాయి. 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల పునర్విభజన ప్రక్రియ ప్రారంభమైంది. వీటిలో ప్రస్తుతం 3,206 డివిజన్లు, వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా వీటిని విభజించనున్నారు. పాత, కొత్త డివిజన్లు, వార్డులకు నాలుగు వైపులా హద్దులు హద్దులు నిర్ణయించాక ప్రాథ మిక నోటిఫికేషన్ ఇచ్చి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. అనంతరం మార్పులు, చేర్పులతో కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తుది ఆమోదం కోసం పంపనున్నారు. పునర్విభజనతో డివిజన్లు, వార్డుల సంఖ్య 3,942 పెరగనుంది. అంటే కొత్తగా 736 అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లోని పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది మార్చి 17తో ముగిసింది. మరో నగరపాలక సంస్థ, ఇంకో 12 పురపాలక, నగర పంచాయతీల్లో నవంబరులో ముగియనుం ది. వీటన్నింటికి కలిపి ఇప్పుడు ఎన్నికలు నిర్వహించినా పాత పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తరువాతే కొత్తగా ఎన్నికైన వారు బాధ్యతలు చేపడతారు. పురపాలక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలివ్వడంతో అందుకు అనుగుణంగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సన్నద్ధమవుతోంది. ఆగస్టు, సెప్టెంబరుల్లో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే డివిజన్లు, వార్డుల పునర్విభజనకు వేర్వేరుగా నోటిఫికేషన్లను ఇటీవల జారీ చేసింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెలాఖరుకు పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలి. అధికారులు, సిబ్బంది జనగణన ఏర్పాట్లలో ఉన్నారన్న పురపాలక, నగరపాలక సంస్థల విజ్ఞప్తిపై వచ్చే నెలాఖరు వరకు గడువు పెంచారు. పునర్విభజనపై కొన్నిచోట్ల రెండు రోజుల క్రితం క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభమైంది. ప్రస్తుతం ఒక్కో డివిజన్, వార్డుని రెండుగా విభజించొచ్చని తెలుస్తుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప నగరపాలక సంస్థల్లో ఒక్కోచోట 20 వరకు డివిజన్లు పెరగనున్నాయి.

### డెడికేటెడ్ కమిషన్ నివేదిక తర్వాత రిజర్వేషన్లు

బీసీల గణన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ వచ్చే నెలలో నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగా వార్డు లు, డివిజన్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుం ది. మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదన్న సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. వార్డులు, డివిజన్ల వారిగా ఓటర్ల జాబితాల తుది ప్రచురణ, పోలింగ్ కేంద్రాలు. తదితర అంశాలు నెలాఖరు లోగా కొలిక్కి రానున్నాయి. ఓటర్ల జాబితాలను 2026 మార్చి 9న ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలక శాఖను ఆదేశిస్తూ ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ ఇచ్చింది. మరికొంత సమయం కావాలన్న ఆ శాఖ విజ్ఞప్తిని రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఓటర్ల జాబితాల ప్రచురణకు మరోసారి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒక్కో నగరం, పట్టణంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నారు.



# సీఎం సహాయ నిధి.. పేదలకు పెన్నిధి

- చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): పేద ప్రజలు ఆపదలో ఉంటే నేనున్నాను అని ఆదుకోవడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంచి మనసుకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు సోమవారం తోయక జగదీశ్వరి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్ నిధులు అందించడం జరుగుతుందని అన్నారు. కురుపాం మండలానికి చెందిన బియ్యాలవలస గ్రామానికి చెందిన పాలక సుందరరావుకు రూ.30786, కిచ్చాడ గ్రామానికి చెందిన పద్మనాదం సుస్మితకు రూ.23,400, కురుపాం గ్రామానికి చెందిన కర్రి సత్యనాయుడుకు రూ.52,522 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. చెక్కు అందుకున్న వారు మాట్లాడుతూ... వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన తోయక జగదీశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కె.వి.కొండయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, కురుపాం పిఏసిఎస్ చైర్మన్ దొల్లు కిషోర్, నాయకులు కడాయి, రామకృష్ణ, శ్రీను, సుబ్బలక్ష్మి, రంగారావు, మాసయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును సోమవారం టీడీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర... పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉన్న వాళ్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధితులకు ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందజేస్తున్నారని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం ఎమ్మెల్యే విజయ్ చంద్రని సహాయం కోసం అడిగితే అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, వారు చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఎమ్మెల్యే విజయచంద్రకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భోగాపురం వరకూ మెట్రోను పొడిగించాలి



విశాఖపట్నం (చైతన్యరథం): రుషికొండ ఐటీ సెజ్కు మెట్రో సేవలు అందించాలని.. భోగాపురం వరకు పొడిగించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. విశాఖ వచ్చిన మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని మెట్రో గురించి చర్చించారు. కొమ్మాది వరకు ప్రతిపాదించిన మెట్రోను భోగాపురం వరకు పొడిగిస్తే ఎయిర్ పోర్టు యూజర్లు ఉపయోగపడటంతో పాటు ఆ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని గంటా అభిప్రాయపడ్డారు. రోడ్డు సౌకర్యం సహ మెట్రో కూడా అందుబాటులో ఉంటే విశాఖ నుంచి భోగాపురం వెళ్లే ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. రుషికొండలో కాగ్నిజెంట్, యాక్సెంచర్, టీసీఎస్ వంటి అంతర్జాతీయ ఐటీ సంస్థలు ఏర్పాటు కానుండడంతో మెట్రో లైన్ను ఆ ప్రాంతానికి అనుసంధానిస్తే ఐటీ ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. విశాఖలో 4 కారిడార్ల కింద మొత్తం 76.90 కిలో మీటర్ల మెట్రోను ప్రతిపాదించినట్టు రామకృష్ణారెడ్డి వెల్లడించారు. మొదటి దశలో రూ. 11,498 కోట్లతో 46.23 కిలో మీటర్ల లైన్ నిర్మిస్తున్నామన్నారు. సుమారు 100 ఎకరాల భూ సేకరణ కోసం రూ.882 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. నేషనల్ హైవే మీదుగా 10 ఫ్లైఓవర్లు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ కష్టాలు అధిగమించవచ్చని చెప్పారు.

# నేరేడి బ్యారేజీ నిర్మాణం.. చరిత్రలో నిలిచిపోయే ఘట్టం!

- దివంగత నేత ఎర్రన్నాయుడు ఆశయం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ఏడాదిన్నరలో పూర్తి.. రూ.60 కోట్ల మంజూరుకు సీఎం సానుకూలత
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర రైతాంగ దశాబ్దాల కల అయిన నేరేడి బ్యారేజీ నిర్మాణం చరిత్రలో నిలిచిపోయేలా సాకారం కాబోతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సుమారు 50 ఏళ్ల ఆరాటానికి ఎట్టకేలకు మోక్షం లభించిందని, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆయన ఉద్ఘాటించారు. నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో నందిగాం మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు.

**ఎర్రన్నాయుడు ఆశయం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం**

నేరేడి బ్యారేజీ నిర్మాణం దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కల అని, ఆ ఆశయాన్ని నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అచ్చెన్నాయుడు భావోద్వేగంతో పేర్కొన్నారు. నేరేడి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం ఒక చారిత్రాత్మక విజయం. ఇందుకోసం తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర పెద్దలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపారు. ఆ కృషి ఫలితంగానే నేడు సమస్య పరిష్కార దిశగా అడుగులు పడ్డాయని తెలిపారు. ప్రాజెక్టు పనుల కోసం ప్రాథమికంగా రూ.60 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

**వైకాపా హయాంలో ప్రాజెక్టులు నిర్వీర్యం**

గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని మంత్రి మండిపడ్డారు. 2010లో ట్రిబ్యునల్ ఏర్పాటుతో పరిష్కారం మొదలైతే, 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం చేశారని గుర్తు చేశారు. 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం కనీస ప్రయత్నం కూడా చేయకుండా జిల్లా ప్రయోజనాలను పక్కన పెట్టిందని విమర్శించారు. ప్రతిష్టాత్మకమైన ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు గతంలో రూ.450 కోట్లు మంజూరై పనులు శరవేగంగా సాగాయని, కానీ గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికొదిలేసిందని ఆరోపించారు. సాగునీటి రంగానికి కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. నేరేడితో పాటు ఆఫ్‌షోర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరలో ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే, జిల్లా రైతాంగం ఏడాదికి రెండు మూడు పంటలు పండించుకునే వెసులుబాటు కలుగుతుందని, శ్రీకాకుళం జిల్లా అన్నపూర్ణగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. Pacs మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింహగిరిపై చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అనిత



సింహాచలం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ నెల 20న జరగనున్న స్వామివారి చందనోత్సవాన్ని పురస్కరించుకొని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సింహాచలం ఆలయ ఈవో వెంకటరావుతో కలిసి మంత్రి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. చందనోత్సవం సందర్భంగా భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ నిర్వహించడంతో పాటు, ఆధునిక ఏఐ టెక్నాలజీని వినియోగించాలన్నారు. భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా పంపిణీ చేయాలన్నారు.

# సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి గుమ్మిడి



సాలూరు (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు 14,100 సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని రాష్ట్ర మంత్రి సంధ్యారాణి అన్నారు. సాలూరు మండలంలోని కొత్తవలస పంచాయతీ కేంద్రంలో 36 మంది గిరిజనుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్యానల్స్ను సోమవారం మంత్రి ప్రారంభించారు. నియోజకవర్గంలో ఒకేసారి 4వేల కనెక్షన్లు ఇచ్చినట్టు చెప్పారు. వైసీపీ హయాంలో గిరిజనులు విద్యుత్ బిల్లులు చెల్లించేవారని.. ఇప్పుడు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కూటమి ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం పేరిట దోపిడీ జరిగిందని.. అలాంటి సమస్యలు ఉండకూడదనే ముఖఆధారిత హాజరు విధానాన్ని తీసుకువచ్చామన్నారు. సిగ్నల్స్ లేని చోట ఎవరికైనా ఇబ్బందులు ఉంటే అక్కడ తక్షణమే సెల్ టవర్ల ఏర్పాటు చేయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

# శ్రీకాకుళం - తిరుపతి రైలును ప్రారంభించిన రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస (చైతన్యరథం): శ్రీకాకుళం రైల్వే స్టేషన్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలును సోమవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్లో ప్రారంభించారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలసకు బైక్ ర్యాలీ నిర్వహించి రైల్వే స్టేషన్ చేరుకొని రైలును ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా చేస్తున్న కృషి నేటికి ఫలించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు వేయించాలనే పట్టుదలతో కేంద్ర రైల్వే శాఖ మంత్రిని పలుమార్లు కలిసి అధికారులతో చర్చించి రైలు ప్రారంభించగలిగానని చెప్పారు. శ్రీకాకుళం నుంచి హైదరాబాదుకు కూడా ఒక రైలు వేసే విధంగా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రైల్వే డీఆర్ఎం లలిత్ బోహరాతో పాటు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# మానవత్వంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం : మంత్రి నిమ్మల



పాలకొల్లు (చైతన్యరథం): రాష్ట్రంలో పేదలు, మధ్య తరగతి వర్గాల పట్ల కూటమి ప్రభుత్వం మానవత్వంతో పని చేస్తుందని, అందుకు నిదర్శనం వారం వారం క్రమం తప్పకుండా లక్షలాది రూపాయలు అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి సాయమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద పాలకొల్లు నియోజకవర్గంలో 87 మందికి వైద్య సాయంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 58 లక్షల చెక్కులను, సీఎం చంద్రబాబు ఫోటోను కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద వర్గాల వైద్య ఖర్చులను భరించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయనిధిని పునరుద్ధరించి పెద్దఎత్తున సాయం అందిస్తూ ఆదుకుంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మేలు పొందిన ప్రతి ఒక్కరు మరో 10 మందికి మంచిని చెప్పాలని కోరారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూపాయి కూడా సాయం అందలేదన్నారు. ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే 20 నెలల కూటమి ప్రభుత్వంలో 13 కోట్లు వరకు సాయం అందించినట్లు మంత్రి రామానాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినుకొండలో బీ.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకల ఏర్పాట్లు



వినుకొండ (చైతన్యరథం): భారత రాజ్యాంగ నిర్మాత, పేద బడుగు బలహీన వర్గాల పెన్నిధి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలు పండుగ వాతావరణంలో జరుపుకోవడం, అంబేద్కర్ ఆలోచన విధానాలపై చర్చించుకోవడం, సామాజిక మార్పు కోసం, కుల వివక్ష అంటరానితనం నిర్మూలనకు కృషిచేసి అత్యున్నత కీర్తి ప్రతిష్టలు పొందిన అంబేద్కర్ సేవలను స్మరించుకొనేందుకు వినుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, ముఖ్యంగా పేద, గబడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులు అభిమానులు కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా పార్టీ కార్యాలయం నుండి నరసరావుపేట రోడ్డులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరుగుతుందని, అదేవిధంగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించేందుకు, ఆయన సేవలను స్మరించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన బడుగు బలహీన వర్గాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బాధ్యతగా హాజరై, డాక్టర్ అంబేద్కర్‌కు ఘన నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీ నాయకులు కూడా విధిగా వేడుకల్లో పాల్గొనాలని జీవీ ఆహ్వానించారు.

# శాస్త్రోక్తంగా సీతారామలక్ష్మణ విగ్రహాల నిమజ్జనం



కోటిపల్లి (చైతన్యరథం): కోనసీమ జిల్లా కోటిపల్లి గోదావరి తీరంలో సీతారామలక్ష్మణ విగ్రహాల నిమజ్జనం శాస్త్రోక్తంగా ముగిసింది. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం శాంతి హోమం తర్వాత విగ్రహాలను అధికారులు గోదావరిలో నిమజ్జనం చేశారు. వైకాపా హయాంలో 2020 డిసెంబర్ 28న విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయంలో దుండగులు రాముడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఆ తర్వాత నూతన విగ్రహాలు తయారు చేయించి, పునఃప్రతిష్ఠ చేశారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం.. ధ్వంసమైన విగ్రహంతోపాటు పాత సీతాదేవి, లక్ష్మణ విగ్రహాలను నిమజ్జనం చేయాలని పండితులు నిర్ణయించారు. ఈ క్రమంలో రామతీర్థం నుంచి విగ్రహాలను సింహాచలం, అన్నవరం, పిఠాపురం, ద్రాక్షారామం మీదుగా ఊరేగింపు నిర్వహించి కోటిపల్లి తీసుకొచ్చారు. గోదావరి తీరంలో శాంతిహోమం తర్వాత విగ్రహాలను జలాధివాసం చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవాదాయశాఖ ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించింది.

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

- **16వ తేదీ వరకు మహిళలకు ఉచితంగా పరీక్షలు**
- **జీజీహెచ్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): ప్రతి నిత్యం కుటుంబం కోసం కష్టపడే మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ఉచిత గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. PINCC సంస్థ ఆధ్వర్యంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని PINCC సంస్థ జీజీహెచ్ నాట్కో విభాగంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉచిత గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను నిర్వహించ తలపెట్టిందని తెలిపారు. జీజీహెచ్ లోని నాట్కో సెంటర్ లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 30 నుంచి 65 సంవత్సరాల మహిళలు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చని చెప్పారు. క్యాన్సర్ వ్యాధి వచ్చే వరకు మనకు తెలియదని, ఒక వేళ నిర్ధారణ అయితే లక్షల రూపాయలు వైద్యానికి వెచ్చించాల్సి వస్తుందని అన్నారు. ప్రస్తుతం ఈ క్యాంపు ద్వారా ఉచితంగా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందిస్తున్నారని తెలిపారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ గురించి ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆశ కార్యకర్తల ద్వారా ప్రతి ఇంటిలో మహిళలను చైతన్యం చేయనున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 14 సంవత్సరాల బాలికలకు క్యాన్సర్ రాకుండా ముందుగానే వ్యాక్సిన్ అందిస్తోందని తెలిపారు.

# పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే కూటమి లక్ష్యం : ఆదిరెడ్డి శ్రీనివాస్

- **జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ**
- **రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా**
- **వైద్యసేవల్లో నిర్లక్ష్యం సహించబోమని అధికారులకు హెచ్చరిక**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా పరిశీలించి వైద్యసేవల స్థితిగతులపై సమగ్రంగా ఆరా తీశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటూ, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా సిటీ స్కాన్, ఎక్స్‌రే, ఓపీ, ఇతర కీలక విభాగాలను పరిశీలించిన ఎమ్మెల్యే... పేషెంట్లకు అందుతున్న సేవలపై అధికారులను ప్రశ్నించారు. అవసరమైన చోట సదుపాయాలు మెరుగుపర్చాలని, పరికరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూడాలని, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... "ప్రభుత్వ ఆసుపత్రి అనేది పేదల ప్రాణాధారం... ఇక్కడికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందేలా చూడటం మన బాధ్యతని వైద్యులకు సూచించారు.

# పోలవరంలో 'స్వచ్ఛ రథం' వాహన ప్రారంభోత్సవం



పోలవరం (చైతన్యరథం): పోలవరంలో పారిశుద్ధ్య మెరుగుదల మరియు సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఏపీ ట్రైకార్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి 'స్వచ్ఛ రథం' వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరియు ప్రజల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు మరియు గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సొంగా



చింతలపూడి (చైతన్యరథం): చింతలపూడి ఏలూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సోమవారం లింగపాలెం మండలం పర్యటనలో భాగంగా రహదారి నిర్మాణ పనులు ఏ విధంగా జరుగుతున్నాయి? గుత్తేదారు సంస్థ ఏమేర నాణ్యత పాటిస్తున్నారా? లేదా? అనే విషయాలను నిశితంగా పరిశీలించారు. నిత్యం ట్రాఫిక్ ఉండే ఈ రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు మార్జిన్ల వైపు విశాలంగా వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా నిర్మాణపు పనులు శాశ్వత ప్రతిపాదికన చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

# వైసీపీ పాలనలో 250 ఆలయాల్లో దాడులు

విజయనగరం (చైతన్యరథం): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రామతీర్థం కోదండ రాముడి ఆలయంలో శ్రీరాముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం రామతీర్థంలో ధ్వంసమైన శ్రీరాముడి, సీత, లక్ష్మణ విగ్రహాలను కోటిపల్లిలోని గోదావరి తీరంలో నిమజ్జనం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలోనే రామతీర్థం నుంచి వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం విగ్రహాలను ప్రత్యేక వాహనంలో కోటిపల్లికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం మాధవి, నడికుదిటి ఈశ్వరరావుతో కలిసి మంత్రి కొండపల్లి మాట్లాడారు. "వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 250 ఆలయాలతో పాటు ఆలయాలకు చెందిన వ్యక్తులపై దాడులు జరిగాయన్నారు.

## అనిశ్చితి నుంచి స్థిరత్వం వైపు ప్రయాణిస్తున్న రాష్ట్రం

●టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్



విజయవాడ (చైతన్యరథం): గత ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి రాష్ట్ర ఐక్యతను దెబ్బతీశారని, ఫలితంగా పెట్టుబడిదారుల్లో అనిశ్చితి పెరిగి, పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయారని, కూటమి పాలనలో రాష్ట్రం అనిశ్చితి నుంచి స్థిరత్వం వైపు ప్రయాణిస్తుందని టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం 19వ డివిజన్ గ్రీన్లాండ్స్ హోటల్ ఏరియాలో గద్దె క్రాంతి కుమార్ పర్యటించి, స్వయం ఉపాధి నిమిత్తం సగుర్తి పార్వతీ అనే మహిళకు రూ.25 వేలు విలువచేసే బడ్డీ కొట్టును సొంత నిధులతో అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ... జగన్మోహన్‌రెడ్డి సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని విషయంలో రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా, వారి నమ్మకాన్ని ద్రోహం చేశారని ఆరోపించారు. రాజధాని నిర్మాణాన్ని నిలిపివేయడం వల్ల రాష్ట్ర అభివృద్ధి గణనీయంగా వెనుకబడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, అధిక అప్పుల భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో పారదర్శకత లేకపోవడం, అవినీతి పెరగడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని అన్నారు. రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్కొక్కటి చక్కబెట్టుకుంటూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని స్థిరత్వం మరియు అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు, పరిశ్రమలు, పెట్టుబడుల ఆకర్షణలో వేగం పెంచుతూ ఆంధ్రప్రదేశ్‌ను పురోగతిపథంలో నడిపించేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం రానున్న రోజుల్లో కూడా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే అరాచక శక్తులను ప్రజలే తిరస్కరించాలని, అభివృద్ధికి తోడ్పడే నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని గద్దె క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు.

## విద్యారంగంలో పెద్దఎత్తున సంస్కరణలు

● జగ్గయ్యపేటలోని బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి సవిత, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గంలోని వత్సవాయి మండలం, వత్సవాయి గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, వసతులు, హాస్టల్ నిర్వహణ, భోజన నాణ్యత తదితర అంశాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి బోధన విధానం, ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించారు. హాస్టల్‌ను సందర్శించిన మంత్రి, ఎమ్మెల్యే ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకుని, ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన మంత్రి నిల్వ ఉంచిన సరుకుల నాణ్యతపై దృష్టి సారించి, వాటిని శుభ్రంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం పాఠశాలకు సహకరించిన దాతలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ... గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి వసతులు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ... గురుకుల పాఠశాలలు పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో గురుకుల పాఠశాలల్లో బోధన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ విద్య, ఇంగ్లీష్ మీడియం బోధన, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచనలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాయకులను తీర్చిదిద్దే విశ్వవిద్యాలయం తెలుగుదేశంపార్టీ

● మండల పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్



మైలవరం (చైతన్యరథం): సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ నాయకులను తీర్చిదిద్దే విశ్వవిద్యాలయం అని, తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడమే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో విజయవాడ రూరల్ మండల తెలుగుదేశం పార్టీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా అన్న ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ "కుక్కకు నెయ్యి అంటే ఇష్టం ఉండదు. అలానే జగన్మోహన్‌రెడ్డికి అభివృద్ధి అంటే నచ్చదు. అందుకే 151 సీట్లు ఇస్తే దాన్ని పోగొట్టుకుని చివరకు 11 మిగుల్చుకుని ఇప్పుడు లెవెన్‌రెడ్డి అయ్యాడు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తన అహంకారంతో చేజేతులా జగన్మోహన్ రెడ్డి పోగొట్టుకున్నాడు. రాజకీయాలలో అహంకారం పనికిరాదు. అమరావతి రాజధానిని వ్యతిరేకిస్తూ 'మావిగన్' అంటూ జగన్ వింత ప్రచారం చేస్తున్నాడు. ఎన్టీఆర్ ఆశయాలతో ఏర్పడిన తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తను కూడా ఉన్నతమైన నాయకుడిగా తీర్చిదిద్దే శక్తి, స్వేచ్ఛాయుత వాతావరణం ఉంటుంది. క్రమశిక్షణ, ప్రజలకు సేవ చేయడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం టీడీపీ ప్రధాన లక్ష్యం. నాయకులు కపటత్వం విడనాడి, సహజత్వం అలవర్చుకోవాలి. ప్రజలకు పేదరికాన్ని దూరం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపటమే సీఎం చంద్రబాబు ధ్యేయం. టీడీపీకి తిరుగు లేదు. తెలుగుజాతి ఉన్నంత వరకు పార్టీ ప్రజాసేవలో ఉంటుంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అందరూ ఐకమత్యంతో పనిచేయాలని కోరారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): పట్టణం మెయిన్ సెంటర్‌లో సోమవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... గత 17 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా ప్రజాసేవలో కొనసాగుతున్న అయ్యప్ప సేవా సమితి వారి సేవలు ప్రశంసనీయం అని కొనియాడారు. వేసవి కాలంలో ప్రజలకు చల్లని నీరు అందిస్తూ సమాజానికి ఉపశమనం కలిగించే ఈ చలివేంద్రం, సేవా సమితి వారి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, స్థానిక నాయకులు, సమితి సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## పేదల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడమే పీ-4 లక్ష్యం

●చిరు వ్యాపారులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే బొండా ఉమా... టిఫిన్ బండి అందజేత



విజయవాడ (చైతన్యరథం): పేదల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడమే పీ-4 కార్యక్రమ ముఖ్య లక్ష్యమని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. సోమవారం సింగ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో 59వ డివిజన్ సింగ్‌నగర్ కృష్ణ హోటల్ సెంటర్‌కు చెందిన బస్సు వరప్రసాద్‌కి, బొండా సిద్ధార్థ తన సొంత నిధుల నుంచి రూ.30వేల విలువ చేసే టిఫిన్ బండిని అందజేశారు. అనంతరం బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి, చిరు వ్యాపారులు మరియు కష్టపడి జీవనం సాగించే కుటుంబాలకు అండగా నిలబడటమే తమ లక్ష్యమని తెలిపారు. పీ-4 పథకం ద్వారా తమ కుమారులు మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ ఎంతోమంది అవసరమైన వారికి సహాయం అందిస్తున్నారని, ముఖ్యంగా స్వయం ఉపాధిపై ఆధారపడిన కుటుంబాలకు తోపుడుబండ్లు, టిఫిన్ బండ్లు, చిన్న వ్యాపార సామగ్రి అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతున్నారని చెప్పారు. ఇప్పటివరకు సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో 200కు పైగా తోపుడుబండ్లు, టిఫిన్ బండ్లు మరియు చిరు వ్యాపార సాధనాలు లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఇవి కేవలం సహాయం మాత్రమే కాకుండా, ఎన్నో కుటుంబాలకు ఆదాయ వనరుగా మారి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. రోడ్డుపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్న వారికి పోలీసుల నుండి లేదా ఇతర విభాగాల నుండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని అడిగిన వెంటనే స్పందించి టిఫిన్ బండిని అందజేసిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు లబ్ధిదారుడు బస్సు వరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురుపాల్గొన్నారు.

## దేవాలయాల పరిరక్షణ మనందరి బాధ్యత : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

●కౌతవరంలో శతాబ్దాలు చరిత్ర కలిగిన ఆలయాల కమిటీలు... బాధ్యతతో పనిచేయాలి



గుడివాడ (చైతన్యరథం): దేవాలయాల్లో ఆధ్యాత్మిక వైభవాలను పెంపొందించేలా ప్రతి ఒక్కరు భక్తి భావంతో కృషి చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆలయాల పరిరక్షణ మనందరి బాధ్యత కావాలన్నారు. గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ గౌతమేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామివారి ఆలయాల ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాముకు ఆలయాల సంప్రదాయం ప్రకారం, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధర్మకర్తల కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాలకు ధర్మకర్తల కమిటీ సభ్యులుగా నియమితులైన వారు, దేవాలయాలను పరిరక్షించడం, అభివృద్ధి చేయడం అందరి బాధ్యతగా భావించాలని సూచించారు. ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక వైభవాలను పెంపొందించేలా భక్తుల సహకారంతో కమిటీలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# జువ్వలదిన్నె ప్రైవేట్ పరం చేసే ప్రసక్తి లేదు

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడి



సర్వేపల్లి (చైతన్యరథం): మత్స్యకారులకు అన్యాయం జరిగితే గళం విప్పే మొదటి వ్యక్తిని తానేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. ఆ పరిస్థితి వస్తే అధికార పార్టీ ఎమ్మెల్యే అనే విషయాన్ని కూడా మరిచిపోయి పోరాడతానన్నారు. జువ్వలదిన్నె హార్బర్ ను ప్రైవేటు పరం చేసే ప్రసక్తే లేదన్నారు. నేలటూరు జెట్టీని పూర్తి చేయించే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. మన తీర ప్రాంతానికి తీరని ద్రోహం చేసింది వైఎస్సార్ కుటుంబమేనని విమర్శించారు. నెల్లూరులో మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆర్థిక ప్రయోజనాల కోసం కృష్ణపట్నం పోర్టు నుంచి వాడరేవు వరకు ఎలాంటి పోర్టులు, హార్బర్ల నిర్మాణం చేపట్టకూడదని 2008లో జీఓ ఎంఎస్ నెం 40 జారీ చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి మత్స్యకారులకు, తీర ప్రాంతానికి ద్రోహం చేసే ఆ జీఓను 2018లో రద్దు చేసిన నారా చంద్రబాబు 2018-19 కాలంలో టీడీపీ ఎన్డీఏ నుంచి బయటకొచ్చి కేంద్ర ప్రభుత్వంతో రాజకీయ విభేదాలున్నా అప్పటి ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సహకారంతో జువ్వలదిన్నె హార్బర్ మంజూరు చేయించుకున్నామన్నారు. మూడు నెలల్లో జువ్వలదిన్నె హార్బర్‌ను పూర్తి చేసి మత్స్యకారులకు అందిస్తామన్నారు.

## పొన్నెబోయిన చెంచు రామయ్య వర్ధంతి

ఉదయగిరి (చైతన్యరథం): మెట్ట ప్రాంత అభివృద్ధి ప్రధాత, ఉదయగిరి నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు స్వర్గీయ పొన్నెబోయిన చెంచు రామయ్య వర్ధంతి కార్యక్రమం మాజీ జిల్లా ప్రజాపరిషత్ ఛైర్మన్ చెంచల్ బాబు యాదవ్ ఆధ్వర్యంలో గండిపాలెం రిజర్వాయర్ వద్ద జరిగింది. కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్ మరియు స్థానిక టీడీపీ నేతలతో కలిసి, శాసనమండలి సభ్యులు, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు బీద రవిచంద్ర పాల్గొన్నారు. అనంతరం పొన్నెబోయిన చెంచురామయ్య చిత్రపటానికి బీద రవిచంద్ర పూలమాలతో నివాళులు అర్పించారు. మెట్టప్రాంత అభివృద్ధి కోసం వారు చేసిన సేవలు, కృషిని ఈ సందర్భంగా బీద మననం చేసుకున్నారు.

# అంబేద్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు



కోవూరు (చైతన్యరథం): భారతదేశ చరిత్రలో ఏప్రిల్ 14 బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఒక అపురూపమైన రోజని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొనియాడారు. విడవలూరు మండలం దంపూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలనకు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. సమాజంలో సగభాగమైన మహిళలకు హక్కులు కల్పించడంలో ఆయన చూపిన చొరవను ప్రశంసిస్తూ నాడు ఆయన వేసిన పునాదుల వల్లే నేడు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టగలుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ముందు తరాలకు అంబేద్కర్ గొప్పతనాన్ని చాటిచెప్పేలా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆమె ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. కేవలం 22 నెలల కూటమి ప్రభుత్వ పాలనలోనే దంపూరు గ్రామంలో 86 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా 4 లక్షల రూపాయలతో లో-ఓల్టేజ్ సమస్యను పరిష్కరించడమే కాకుండా, 5 లక్షలతో చౌకిచర్ల చెరువు నుంచి కాలువ పూడికతీత పనులు చేపట్టామన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన త్రాగునీటి కోసం జలజీవన్ మిషన్ ద్వారా 17 లక్షలు, వైద్య సౌకర్యం కోసం 36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించామని తెలిపారు. అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో కలిపి మొత్తం 20 లక్షల రూపాయలతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించామని, ఆరుగురు బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా 3.63 లక్షల ఆర్థిక సహాయం అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జువ్వలదిన్నె హార్బర్‌తో మత్స్యకారులకు మహర్దశ

## కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



కావలి (చైతన్యరథం): మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేసేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని, అందుకే మత్స్యకారులు ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడ్డారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతుందని అన్నారు. బీజేపీ--జనసేన--తెలుగుదేశం సంకీర్ణ ప్రభుత్వం మత్స్యకారుల జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మత్స్యకార భరోసా పథకాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన అర్హులైన మత్స్యకారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అధిక శాతం లబ్ధిదారులకు ఈ పథకం అందుతున్నదని చెప్పారు. కేవలం వైసీపీ తమ పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసం జగన్ ను జువ్వలదిన్నె కు తీసుకొని వస్తున్నారని విమర్శించారు. జగన్ కార్యక్రమానికి మత్స్యకారులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో, బయటి నేతలను, కార్యకర్తలను తీసుకొని వచ్చే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జువ్వలదిన్నెలో 115 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉన్న ఆధునిక ఫిషింగ్ హార్బర్ మత్స్యకారుల భవిష్యత్తును మారుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.158 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. హార్బర్‌లో ఆధునిక జెట్టీలు, లోడింగ్--అన్‌లోడింగ్ సదుపాయాలు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, ఫిష్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, బోగోలు మండల టీడీపీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, రేబాల శంకర రెడ్డి, మేడా క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# సీఎం చంద్రబాబు నిర్ణయాలు పేదల పాలిట వరాలు

## మీడియా సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

చిత్తూరు (చైతన్యరథం): సచివాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయాలు తీసుకోవడం ఆనందదాయకమని టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. ఇతర సర్వీస్ ఇనాంలోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి కల్పించనున్నారని వెల్లడించారు. దీని కోసం కొత్తగా చట్టం తీసుకురావాలని సీఎం ఆదేశాలు ఇవ్వడం జరిగిందని. 2019లో సర్వీస్ ఇనాం భూములకు సంబంధించి నాడు ఆర్డినెన్స్ జారీ చేసినప్పటికీ, తరువాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరుగున పడిందన్నారు.

దురుద్దేశంతో గత ప్రభుత్వం దీనిని చట్టంగా మార్చకుండా లక్షల కుటుంబాలకు నష్టం చేకూర్చిందన్నారు. అయితే ప్రజా ప్రభుత్వం వీరికి న్యాయం చేసేందుకు, సాయంగా నిలిచేందుకు దీనిపై చట్టం చేయాలని నిర్ణయించిందన్నారు.

### ఇంటి పట్టా ఉంటే... రిజిస్ట్రేషన్

2016కు ముందు ఏదైనా ప్రభుత్వ హౌసింగ్ స్కీంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని సీఎం చంద్రబాబు తీర్మానించడం పేదల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం దాదాపు 75 లక్షల పేద కుటుంబాలకు వరంగా మారనుందన్నారు. 2016 ముందు పట్టా కలిగిన యజమాని నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, విక్రయించేందుకు, గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నిర్ణయం లక్షలాది పేదల కుటుంబాలకు ఆస్తిగా మారుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ కింద 13.59 లక్షల ఎకరాల భూమి ఉండగా ఇందులో అర్హత కలిగిన 9.25 లక్షల ఎకరాలపై భూ యజమానులకు త్వరలో పూర్తిగా యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. రాష్ట్రంలోని ప్రతీ రెవెన్యూ రికార్డును డిజిటలైజ్ చేయాలని, భూ యజమానికి మొబైల్‌కి సాఫ్ట్ కాపీ పంపించాలని సీఎం అన్నారు. ఈ కేవైసీ అనంతరం రికార్డులను బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రపర్చాలని సీఎం చంద్రబాబు సూచించారు. భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి రికార్డ్ లాకింగ్ చేసుకోవచ్చు. దీని కారణంగా ఆయన నాలెడ్జ్ లో లేకుండా రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు. ఈ ప్రెస్ మీట్ లో టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, జిల్లా క్రిష్టియన్ అధ్యక్షుడు మెదక్, చిత్తూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం కార్యదర్శి గోపాల్ జిల్లా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోవిందరాజులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభం

## పర్యవేక్షిస్తున్న 47వ డివిజన్ ఇన్చార్జి డాక్టర్ గణేశ్ కుమార్ బృందం

నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 47వ డివిజన్‌లో రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు సోమవారం నారాయణపేట, కుక్కల కుంట ప్రధాన రహదారి లో ప్రారంభమయ్యాయి. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 47 48 క్లస్టర్ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారావు మార్గదర్శకత్వంలో 47వ డివిజన్ టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ పర్యవేక్షణలో, ఆయన సూచనల మేరకు చేపడుతున్నారు. రోడ్ల మార్కింగ్ ప్రక్రియ పూర్తి కాగా, ప్యాచ్ వర్క్‌లో భాగంగా ప్రస్తుతం జేసీబీ యంత్రాలతో రోడ్ల బ్రేకింగ్ పనులు ప్రారంభించారు. 49వ డివిజన్ అధ్యక్షుడు, కాంట్రాక్టర్ బండి ప్రసాద్ ఆధ్వర్యంలో పనులు వేగంగా జనరల్ సెక్రటరీ కలవకుంట భాస్కర్, బూత్ ఇన్‌చార్జ్‌లు నీలకంఠం ముని కృష్ణ, కంచి కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి మరియు పొలిటికల్ టీం పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. దెబ్బతిన్న రహదారులను ముందుగా గుర్తించి మార్కింగ్ చేసి, జేసీబీ యంత్రాలతో పాత రోడ్లను తొలగిస్తున్నారు. ఈ ప్యాచ్ వర్క్ ద్వారా రోడ్ల నాణ్యతను మెరుగుపరచి, ప్రజలకు సురక్షితమైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని గణేష్ కుమార్ తెలిపారు. స్థానికులు మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# రాయదుర్గంలో ఘనంగా ప్రగతి పండుగ



## కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయంగా సాగాలని కోరుకుంటూ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రగతి పండుగ' వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాయదుర్గం పట్టణంలోని జంబుకేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య లోక కళ్యాణం కోసం ప్రత్యేక హోమాలు, త్రిపురసుందరి దేవి హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సకుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం పట్టణంలో సుమారు రూ.62 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దాదాపు రూ.160 కోట్లు రాయదుర్గం పట్టణ అభివృద్ధికి మంజూరు చేశారని వివరించారు. ఇందులో వివిధ పద్దుల కింద ఇదివరకే రూ.10 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 'అమృత్ 2.0' పథకం కింద ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా మంచినీటిని అందించేందుకు రూ.78 కోట్లు మంజూరు చేశారన్నారు. అర్ధాంతరంగా ఆగిపోయిన రైల్వే వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి మరో రూ.46 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాయదుర్గం అభివృద్ధికి రూ.50 కోట్లు కావాలని కోరానని, అందులో భాగంగా డిఎఫ్ఐడి కింద రూ.30 కోట్లు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. జంబుకేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న హోమాలు, పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకొని దైవ అనుగ్రహం పొందాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రగతి పండుగ కార్యక్రమంలో భాగంగా కనేకల్లు మండలం మాల్యం గ్రామంలో సోమవారం నిర్వహించిన మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు,మాజీ కౌన్సిలర్లు టశీకశాల హనుమంతు రావుత్ రాజశేఖర్, పూజారి శివ, అగ్రహారం కిరణ్, ఎల్లప్ప, పైతోట అంజి, చిదానంద, పైతోట రామంజి పాల్గొన్నారు.



# పీఎం సూర్యఘర్ యోజన ప్రారంభం

## పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి (చైతన్యరథం): పుట్టపర్తి మున్సిపాల్టీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకు ముందు బ్రాహ్మణపల్లి తండాలో కళ్యాణబాయి, గోపాల్ నాయక్ ఇంటిపై సోలార్ ప్యానల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కొక్క ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు రెండు కిలో వాట్ల సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే సుమారు రూ.లక్షా 20వేలు ఆ కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. నియోజకవర్గంలో 1657 యూనిట్లు ఏర్పాటు లక్ష్యం కాగా వీటికి రూ.19.98 కోట్లు ప్రభుత్వ రాయితీ ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డివిజన్ ఈఈ శివరాముడు, స్థానిక నాయకులు కూటమి పార్టీల నాయకులు టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు సాముకోటి ఆదినారాయణ, మాజీ చైర్మన్ బెస్త చలపతి,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఓలిపి శ్రీనివాసులు, అంబులెన్స్ రమేష్, శ్రీరామ్ నాయక్, కృష్ణ ప్రసాద్, సురేష్ చౌదరి అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జలధారకు పదిరోజుల్లో ప్రణాళికలు సిద్ధం చేయండి : ఎమ్మెల్యే పరిటాల



రాప్తాడు (చైతన్యరథం): జలధార పథకం కింద ఎలాంటి పనులు చేపట్టాలన్న అంశంపై పది రోజుల్లోపు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ అతిథి గృహంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో జలధార పథకం కింద పనుల ఎంపిక, నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార కార్యక్రమంలో చెరువుల మరమ్మతులు, చెరువుల పటిష్టతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతుల అవసరాలు, తాగునీటి సమస్య తీర్చే విధంగా పనులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ అధికారులు, జలధార ఇన్చార్జి, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో కలిసి పనులను గుర్తిస్తామని అధికారులు తెలియజేశారు. గ్రామంలో చేపట్టే ప్రతి పని రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అందుకే సాగునీటి సంఘాలు, రైతులు, గ్రామ ప్రజల సహకారంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని దీని ఫలితాలు వచ్చే వర్షాకాలంలో మనకి కనిపించాలన్నారు. చేపట్టే పని వృధాగా ఉండకూడదని ఆదేశించారు.

# సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

## మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెల్లడి

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధి సంబంధిత పలు సమస్యలను ఎమ్మెల్యేకి వినిపించగా, ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. న్యాయబద్ధమైన సమస్యల విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బాధితుల సమస్యలను అధికారులు సమర్థంగా పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

## ఏఎల్ఈఏపీ ప్రతినిధులకు ఎమ్మెల్యే దగ్గుపాటి విన్నపం



అనంతపురం (చైతన్యరథం): నగరంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా ప్రతినిధులను కోరారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ఏ.ఎల్.ఈ.ఏ.పీ కార్యాలయానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెళ్లారు. అక్కడ సంస్థ చైర్మన్ రమాదేవిని కలిసి అనంతపురం జిల్లాలో పరిస్థితుల గురించి వివరించారు. అనంతపురంలో ఇటీవల ఎంఎస్ఎంఈ పార్కును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పరంగా సహకారం ఉంటుందన్నారు. మీ సంస్థ పరంగా మహిళా పరిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై ఛైర్మన్ రమాదేవి సానుకూలంగా స్పందించారు.



# ఎన్టీఆర్ వైద్య సేవలు మెరుగ్గా అందించడమే లక్ష్యం

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా పరిటాల శ్రీరామ్

ఎన్టీఆర్ వైద్య సేవలను మెరుగ్గా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని.. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. ధర్మవరం పార్టీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ధర్మవరం పట్టణం, తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం రూరల్ మండలాలకు చెందిన 14మందికి రూ.5.19లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డ్ స్థాయిలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు సాయం అందుతోందన్నారు. ఈ 22నెలల కాలంలోనే ధర్మవరం నియోజకవర్గంలో తన ద్వారా 359మందికి రూ.2.34కోట్ల రూపాయల మేర సాయం అందించామని తెలిపారు.



# సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం : ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



మడకశిర (చైతన్యరథం): పట్టణం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు 82 మందికిగాను30, లక్షల 34 వేల రూపాయల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలు ఆసుపత్రి బిల్లులను ఇస్తే మంజూరైన చెక్కులు కూడా గత వైసిపి పాలకులు స్వాహా చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన వారందరూ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆసుపత్రి బిల్లులను అర్జీల రూపంగా పెట్టుకున్న వారందరికీ సకాలంలో చెక్కులుమంజూరు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి పేదల పక్షపాతి అని పేద ప్రజల అభివృద్ధి కోసం ఎప్పుడు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, సొసైటీల అధ్యక్షులు మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్లు అన్ని అనుబంధ కమిటీ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు వెలుగుల సమ్మేళనం

**డల్లాస్‌లోని రాధాకృష్ణ ఆలయంలో మిన్నంటిన 'టాంటెక్స్' సంబరాలు**

**ఉత్సాహంగా పాల్గొన్న ప్రవాసాంధ్రులు... ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

**డల్లాస్, టెక్సాస్:** ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (TANTEX) ఆధ్వర్యంలో 'పరాభవ' నామ సంవత్సర ఉగాది వేడుకలు డల్లాస్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. రాధాకృష్ణ దేవాలయంలో జరిగిన ఈ వేడుకలకు తెలుగు కుటుంబాల వారు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

### ఆధ్యాత్మికం, సంప్రదాయం

మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైన వేడుక రాత్రి 7:30 గంటల వరకు కొనసాగింది. సంప్రదాయ పూజలతో మొదలైన సంబరాల్లో భాగంగా సిద్ధాంతి పంచాంగ శ్రవణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చిన అతిథులకు ఉగాది పచ్చడి, పానకం అందించి తెలుగు సంప్రదాయాన్ని చాటిచెప్పారు.

### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సాంస్కృతిక విభాగం చైర్ అనిత వేమిరెడ్డి స్వాగత ఉపన్యాసంతో వేడుకలు వేగం పుంజుకున్నాయి. 'రివైవల్' గ్రూప్ సంగీత ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ప్రముఖ కళాకారులు అనిరుధ్ సుస్వరం, మనోజ్ఞ బెల్లంకొండ తమ మధురమైన గాత్రంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. తెలుగు పద్యాల పోటీలు నిర్వహించి భాషాభిమానాన్ని చాటుకున్నారు.

### ప్రముఖుల ప్రసంగాలు - పురస్కారాలు

టాంటెక్స్ అధ్యక్షురాలు మాధవి లోకిరెడ్డి సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు





ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి 'ఉగాది పురస్కారాలు' అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన స్పాన్సర్లకు, జాతీయ తెలుగు సంస్థలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### వేడుక విజయవంతం

యాంకర్లు మధురిమ వోడ్నాల, రాధా పేటారు తమ చమత్కారంతో, సమయస్ఫూర్తితో కార్యక్రమాన్ని ఆద్యంతం రక్తికట్టించారు. సంప్రదాయ నృత్యాలు, సంగీత విభావరి అతిథులను కట్టిపడేశాయి.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ వేడుకను విజయవంతం చేయడంలో 'టాంటెక్స్' కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు కీలక పాత్ర పోషించారు. కుటుంబ సమేతంగా హాజరైన తెలుగు వారు ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండగను ఘనంగా జరుపుకున్నారు.







## అట్లాంటాలో హోరెత్తిన 'గేట్స్' క్రికెట్ కార్నివాల్



**●చరిత్ర సృష్టించిన మహిళా క్రికెటర్లు ●జీఎస్ రెడ్డి మెమోరియల్ ట్రోఫీ విజేతగా 'ఓజీస్'**

**అట్లాంటా, జార్జియా:** గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ (GATES) ఆధ్వర్యంలో జరిగిన జీఎస్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ ట్రోఫీ-2026 హోరెత్తింది. డాసన్‌విల్లేలోని రాక్ క్రీక్ పార్క్‌లో రెండు రోజులు జరిగిన క్రికెట్ పండుగలో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొని క్రీడా స్ఫూర్తి చాటారు.

ఈ ఏడాది టోర్నమెంట్‌లో అత్యంత ప్రధాన ఆకర్షణ తొలిసారిగా మహిళల క్రికెట్ లీగ్‌ను ప్రారంభించడం. 'దేశీ స్మాషర్స్, ఫైర్ బర్డ్స్, సూపర్ నోవాస్, వండర్ ఉమెన్' అనే నాలుగు జట్లు ఈ చారిత్రాత్మక లీగ్‌లో తలపడ్డాయి. బోర్డు సభ్యులు జ్యోత్స్న పాలకుర్తి, గీత నారన్నగారి టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. మహిళా సాధికారత దిశగా 'గేట్స్' వేసిన ఈ అడుగుకు విశేష స్పందన లభించింది.

పురుషుల విభాగంలో మొత్తం 27 జట్లు ప్రతిష్టాత్మక మెమోరియల్ ట్రోఫీ కోసం పోటీపడ్డాయి. 'గేట్స్' అధ్యక్షుడు రమణ గండ్ర క్రీడాకారులకు స్వాగతం పలికి పోటీలను ప్రారంభించారు. మొత్తం 52 మ్యాచ్‌లతో మైదానం విద్యుత్తు కాంతితో, ప్రేక్షకుల కేరింతలతో హోరెత్తిపోయింది.

**మహిళల విభాగం**

**విజేత: ఫైర్ బర్డ్స్, రన్నరప్: దేశీ స్మాషర్స్**

**పురుషుల విభాగం:**

**విజేత: ఓజీస్, రన్నరప్: అస్త్ర క్రికెట్ క్లబ్,**

**మూడవ స్థానం: వాటర్‌ఫోర్డ్ వారియర్స్**

### వ్యవస్థాపకుడికి ఘన నివాళి

'గేట్స్' వ్యవస్థాపకుడు దివంగత జీఎస్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నీ ఆయన ఆశయాలకు తగ్గట్లుగా సమాజాన్ని ఏకం చేసింది. ముగింపు వేడుకలో స్పాన్సర్ సునీల్ గోటూరు, అధ్యక్షుడు రమణ గండ్ర, బోర్డు సభ్యులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ ఈవెంట్ విజయవంతం కావడానికి మధుకర్ రెడ్డి పటేల్, శరత్ గండ్ర అందించిన కృషిని బోర్డు ప్రత్యేకంగా అభినందించింది.

### సమన్వయం, మద్దతు

'గేట్స్'-2026 టీమ్ సభ్యులు జ్యోత్స్న పాలకుర్తి, గీత నారన్నగారి, కీర్తిధర్ గౌడ్ చెక్కిళ్ల, రఘువీర్‌రెడ్డి గాడిపల్లి, రామకృష్ణ గండ్ర, అనిల్ కుష్ణపల్లి, శరత్ గండ్ర, చంద్రశేఖర్ ఆల్తా, మధుకర్ రెడ్డి పటేల్ అన్ని లాజిస్టిక్స్ పనులను పర్యవేక్షించారు. ఆటగాళ్లకు, ప్రేక్షకులకు 'బిర్యానీ పాట్' అందించిన రుచికరమైన భోజనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ క్రీడలను వచ్చే ఏడాది ఇంతకంటే ఘనంగా నిర్వహిస్తామని, మహిళల భాగస్వామ్యం ఈసారి ప్రత్యేక స్ఫూర్తి ఇచ్చిందని 'గేట్స్' కార్యవర్గం పేర్కొంది.











## బర్లింగ్టన్ హనుమాన్ మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

**కుంభాభిషేకం జరిపిన గణపతి సచ్చిదానంద స్వామీజీ**

**బర్లింగ్టన్:** న్యూజెర్సీ రాష్ట్రం బర్లింగ్టన్ నగరంలో ఉన్న SGS కార్యసిద్ధి హనుమాన్ మందిరానికి మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ విచ్చేశారు. అక్కడి కార్యసిద్ధి హనుమాన్, గణేశ, అంబ, సుబ్రహ్మణ్య, దత్తాత్రేయ, శివ విగ్రహమూర్తుల ప్రతిష్ఠాపన మహోత్సవం, కుంభాభిషేకంలను సప్తాహంగా ఎంతో భక్తి శ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. ప్రభాతకాలంలో స్వామీజీ కుంభాభిషేక మహోత్సవానికి ఆశీర్వచనం అందించి కొత్తగా నిర్మించిన ఆలయాన్ని దర్శించి శ్రీచక్ర పూజ జరిపారు. సాయంత్రం స్వామీజీకి ఘనమైన స్వాగత సభ ఏర్పాటు చేశారు. పూజ్య స్వామీజీ ఆశీస్సులు, మార్గదర్శకత్వం వల్లే ఈ దేవాలయ స్థాపన సాధ్యమైందని ఆలయ సభ్యులు, భక్తులు సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞత వ్యక్తపరిచారు. బర్లింగ్టన్ నగరంతో పాటు న్యూజెర్సీ





రాష్ట్రానికి చెందిన ప్రముఖులు హాజరై స్వామికి తమ గౌరవ సూచక ప్రశంసాపత్రాన్ని సమర్పించారు. పూజ్య స్వామీజీ భక్తులకు అనుగ్రహభాషణ చేసి ఆశీస్సులు ప్రసాదించారు.



# మళ్లి.. యుద్ధమేఘాలు

## పశ్చిమాసియాలో పెను ఉద్రిక్తతలు - ఇరాన్‌పై దాడులకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధం



అగ్రరాజ్యం అమెరికా-ఇరాన్ దేశాల మధ్య శాంతి చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని, ఇరాన్ పోర్టులను దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై పరిమితస్థాయి సైనిక దాడులు చేసేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతోంది. ఇరాన్‌ను ఆర్థికంగా, సైనికపరంగా నలువైపులా నిర్బంధించి, సముద్ర మార్గాలపై పూర్తి పట్టు సాధించాలని ట్రంప్ భావిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

ఈ వ్యూహంలో భాగంగా మిత్రదేశాలతో కలిసి నౌకాయాన భద్రతను పటిష్ఠం చేసే అంశంపై అగ్రరాజ్యం చర్చలు జరుపుతోంది. ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌పై విరుచుకుపడేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ ఇప్పటికే సైన్యాన్ని ఆదేశించారు. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకునే తుది నిర్ణయం కోసం ఇజ్రాయెల్ వేచి చూస్తోంది. ఒకవేళ ఈలోగా ఇరాన్ తమపై ఏవైనా దాడులకు పాల్పడితే, ఆ ప్రతిస్పందన ఊహించని రీతిలో ఉంటుందని ఇజ్రాయెల్ సైన్యం గట్టి హెచ్చరికలు చేసింది. ఈ ఉద్రిక్తతల మధ్య ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు. శాంతి చర్చలు విఫలం కావడానికి అమెరికా మొండివైఖరే కారణమని ఆయన ఆరోపించారు. యుద్ధాన్ని ముగించేందుకు ఇస్లామాబాద్ ఒప్పందం వరకు వెళ్లినప్పటికీ, చివరి నిమిషంలో అమెరికా అతివాద లక్ష్యాలతో వెనక్కి తగ్గిందని మండిపడ్డారు.

దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత జరిగిన అత్యున్నతస్థాయి చర్చలు విఫలమవడం దురదృష్టకరమని అరాఘ్చి పేర్కొన్నారు. శత్రుత్వమే అమెరికా లక్ష్యమైతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కాగా ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితితో పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాకుండా ఉంది.

## హర్మూజ్ దిగ్బంధం వేళ..

# జలసంధిలో చిక్కుకున్న భారత నౌకలు




పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న ఉద్రిక్తతల ప్రభావం -హర్మూజ్ జలసంధిపై ఈసారి గట్టిగానే కనిపించనుంది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా దిగ్బంధిస్తామంటూ అమెరికా చేసిన ప్రకటనతో పశ్చిమాసియాలో మళ్లీ గందరగోళం మొదలైంది. ఈ పరిణామాలతో చమురు, గ్యాస్ సరఫరాపై దేశంలో ఆందోళనలు మొదలయ్యాయి. హర్మూజ్ మీదుగా రావాల్సిన 15 భారతీయ నౌకలు ప్రస్తుతం ఈ జలసంధి వద్దే చిక్కుకుపోయాయి. వీటిలో ఎక్కువగా ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ క్యారియర్లు, క్రూడాయిల్ ట్యాంకర్లతోపాటు ఓ కెమికల్ కంటైనర్ సైతం ఉన్నట్టు సమాచారం.

అరేబియా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని ఇరాన్ ఓడరేవులను సోమవారంనుంచి దిగ్బంధిస్తామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరానేతర ఓడరేవుల మధ్య హర్మూజ్ మీదుగా నౌకల రవాణాను నిలిపివేయనప్పటికీ.. అమెరికా ప్రకటనతో ఈ జలసంధిలో నౌకల రవాణా నెమ్మదించింది. నౌకల రాకపోకలు అకస్మాత్తుగా తగ్గినట్లు ట్రాకింగ్ నివేదికలు పేర్కొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత నౌకాదళం.. హర్మూజ్‌లో నిలిచిపోయిన వాణిజ్య నౌకలతో సమన్వయం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం నౌకాదళానికి చెందిన ఆరు ఓడలు ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ సమీపంలో మోహరించాయి. వాణిజ్య నౌకలను సురక్షితంగా హర్మూజ్ దాటించేందుకు ఇవి సాయపడనున్నాయి. ఈ జలసంధి మార్గంలో మొత్తం 25 భారత నౌకలుండగా.. వీటిలో 10 ఇప్పటికే సురక్షితంగా హర్మూజ్‌ను దాటాయి.

# మా పవర్ వాళ్లకు తెలుసు

- శాంతి చర్చలు.. సైనిక చర్యలు.. దేనికైనా సిద్ధమే
- చర్చల వైఫల్యం.. పూర్తిగా అమెరికాదే
- భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతేల

ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతేలీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల అగ్రరాజ్యంతో జరిగిన చర్చలు విఫలమైనప్పటికీ.. తమ డిమాండ్లను అంగీకరిస్తే అమెరికాతో మరోసారి చర్చలకు సిద్ధమేనన్నారు. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా చేసిన ప్రకటనపై స్పందిస్తూ.. జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లోనే ఉందని.. ఆ జలాలను కాపాడుకోవడానికి తమకున్న హక్కులను దేశం వినియోగించుకుంటుందని తెలిపారు. ఇరాన్ ఏవిధంగా శాంతి చర్చలకు కట్టుబడి ఉందో.. అదేవిధంగా సైనిక చర్యలకూ సిద్ధంగా ఉందన్నారు. టెహ్రాన్ శక్తి ఏమిటో అమెరికాకు తెలుసని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం.. తమ ప్రతినిధి బృందం అమెరికా బృందంతో 21 గంటలపాటు చర్చలు జరిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అణు సమస్యలు,




యుద్ధ నష్టపరిహారం, ఆంక్షల ఉపశమనం వంటి మూడు డిమాండ్లను తమ బృందం వారి ముందు ఉంచిందని.. అందుకు అగ్రరాజ్యం ఒప్పుకోకపోవడంతో చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. తమ దేశంపై అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా చేసిన దాడుల్లో 3375 మంది పౌరులు మృతి చెందినట్టు తెలిపారు. ప్రాణ నష్టంతోపాటు గణనీయమైన ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

### గల్ఫ్ రేవులు మూసేస్తాం: ఇరాన్

హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ చేసిన ప్రకటనపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించడం 'సముద్రపు దొంగతనం'తో సమానమని ఐఆర్జీసీ పేర్కొంది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే పర్షియన్ గల్ఫ్ ప్రాంతమంతటా సముద్ర భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. అమెరికా తమ రేవులను దిగ్బంధిస్తే.. తాము గల్ఫ్ రేవులను మూసివేస్తామనింది. భద్రత ఉంటే అందరికీ ఉండాలని.. లేకపోతే ఎవరికీ ఉండకూడదని ఐఆర్జీసీ పేర్కొంది. హర్మూజ్ జలాల్లో భద్రతను పర్యవేక్షిస్తామని ఐఆర్జీసీ పేర్కొంది. తమ ఓడరేవులకు ముప్పు కలిగితే ఈ ప్రాంతంలో ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదని హెచ్చరించింది. శత్రు దేశాల నౌకలను జలసంధి గుండా వెళ్ళడానికి అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇరాన్ అనుమతి పొందిన నౌకలకు మాత్రమే హర్మూజ్‌లోకి ప్రవేశించే వీలు కల్పిస్తామంది. హర్మూజ్‌పై నియంత్రణ కొనసాగించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

# శాశ్వత నివాసానికి 'పదేళ్ల పరిమితి'

## - కఠినతనం కానున్న యూకే నిబంధనలు




యూకేలో శాశ్వత నివాసం కోరే వలసదారులకు నిబంధనలు కఠినతరం కానున్నాయి. ఈమేరకు ఆ దేశ హోంశాఖ మంత్రి షబానా మహమూద్ సూచనప్రాయంగా వెల్లడించారు. దీని ప్రకారం.. 'శాశ్వత నివాస అనుమతి' కోసం దరఖాస్తు చేసుకునే వలసదారులకు ప్రస్తుతమున్న 5ఏళ్ల నివాస గడువును 10 ఏళ్లకు పెంచేందుకు సిద్ధమయ్యారు. మరికొన్ని విభాగాల కింద వలసదారులు శాశ్వత నివాసం కోసం ఇకపై 20ఏళ్లు ఎదురుచూడాల్సి రావొచ్చు. మరోవైపు అర్హత నిబంధనలు కూడా కఠినతరం చేయనున్నారు. వలసదారులకు నేర చరిత్ర ఉండకూడదు. ఆంగ్లభాషా ప్రమాణాలు ఉన్నతస్థాయిలో ఉండాలి. గత మూడేళ్లుగా ఏటా 12,570 పౌండ్లకంటే ఎక్కువ ఆర్జిస్తూ ఉండాలనే నిబంధనలున్నాయి. ఈ కొత్త రూల్స్ అమల్లోకి వస్తే.. ఫుల్‌టైం ఎంప్లాయిమెంట్ అవకాశం తక్కువగా ఉన్నవారు, శరణార్థులు, ఫ్యామిలీ వీసాదారులు, వర్క్ వీసాలపై ఆధారపడినవారిపై ప్రభావం ఎక్కువగా ఉండనుంది. అయితే వ్యక్తిగత పరిస్థితుల ఆధారంగా పదేళ్ల బేస్‌లైన్ మారొచ్చని సమాచారం. ఎన్హెచ్ఎస్ నర్సులు, వైద్యులు, 12,140 పౌండ్లకంటే ఎక్కువ ఆర్జించే అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగులు మూడు లేదా ఐదేళ్ల తర్వాత శాశ్వత నివాసానికి అర్హత పొందే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# హంగేరి పీఎంగా మాగ్యార్

## - కంగ్రాట్స్ చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ



హంగేరీ విపక్ష నేత పీటర్ మాగ్యార్.. స్టన్నింగ్ విక్టరీ కొట్టారు. పార్లమెంటరీ ఎన్నికల్లో మాగ్యార్‌కు చెందిన టిజా పార్టీ అనూహ విజయాన్ని సాధించింది. 16 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న విక్టర్ ఓర్బాన్ షాకింగ్ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. మాగ్యార్‌కు ఫోన్ చేసిన ఓర్బాన్.. విక్టరీ విషెస్ తెలిపారు. ఆదివారం రాత్రి వరకు 98 శాతం ఓట్లను లెక్కించారు. దాంట్లో టిజా పార్టీకి 53.72 శాతం ఓట్లు పోలయ్యాయి. ఫిడేజ్ పార్టీకి 37.67 శాతం ఓట్లు పడ్డాయి. అవినీతిని అంతం చేస్తానని మాగ్యార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ వ్యవస్థలకు ఫండింగ్ పెంచనున్నట్టు చెప్పారు. యురోపియన్ యూనియన్‌తో బంధాలను బలోపేతం చేయనున్నట్టు పేర్కొన్నారు. హంగేరి ఎన్నికల చరిత్రలోనే తొలిసారి అత్యధికంగా ఓటింగ్ నమోదైంది. సుమారు 77.8 శాతం ఓట్లు వేశారు. విక్టరీ తర్వాత దనూబ్ నదివద్ద మద్దతుదారులను ఉద్దేశించి పీటర్ ప్రసంగించారు. మనం సాధించామన్నారు. కలిసికట్టుగా హంగేరి ప్రభుత్వాన్ని కూల్చేశామన్నారు. తాజా లెక్కల ప్రకారం టిజా పార్టీకి 138 సీట్లు రానున్నాయి. ఇక ఓర్బాన్ పార్టీకి 55 సీట్లు మాత్రమే దక్కనున్నాయి. హంగేరి ప్రధానిగా ఎన్నికైన పీటర్ మాగ్యార్, టిజా పార్టీకి ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. హంగేరితో చరిత్రాత్మక బంధం ఉందన్నారు. మునుముందు ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం కావాలన్నారు.

# రాజస్థాన్ విజయాలకు బ్రేక్

- హైదరాబాద్ చేతిలో ఓటమి
- తొలి ఓవర్‌లోనే హింజ్ సంచలనం
- అదరగొట్టిన ఇషాన్ కిషన్

ఐపీఎల్ 2026లో భాగంగా ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. రాజస్థాన్ వరుస విజయాలకు బ్రేక్ వేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్(91; 44 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో చెలరేగిపోయాడు. త్రుటిలో సెంచరీ చేసే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్(40; 26 బంతుల్లో 3 సిక్స్‌లు, 1 ఫోర్) రాణించాడు. ఆర్ఆర్‌కు 217 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రాజస్థాన్ తొలిసారి తడబడింది. 1/1, 1/2, 1/3, 2/4, 9/5 తొలి 3 ఓవర్లకు రాజస్థాన్ స్కోరు ఇది..5 వికెట్లు కోల్పోయి 9 పరుగులు..ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తొలి బంతికే డకౌట్ అయ్యాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 1, ధ్రువ్ జురెల్ 0, ప్రిటోరియస్ 0, రియాన్ పరాగ్ 4 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యారు. ఈ దశలో పెరీరా 44 బంతుల్లో 69, జడేజా 30 బంతుల్లో 45 ఆరో వికెట్‌కు 119 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశారు. 127 పరుగుల వద్ద పెరీరా ఆరో వికెట్‌గా అవుటయ్యాడు. జడేజా ఏడో వికెట్‌గా అవుటయ్యాడు. క్రమంగా వికెట్లు కోల్పోయి 159 పరుగులకు ఆలౌట్ అయింది. హింజ్ 4 వికెట్లతో గెలుపులో కీలక పాత్ర పోషించాడు. తొలి ఓవర్‌లోనే 3 మూడు వికెట్లు తీసి విజయానికి నాంది పలికాడు. షకీబ్ హుస్సేన్ 4 వికెట్లు తీశాడు.



### 48 గంటల్లో వివరణ ఇవ్వాలి..

## రోమి భిందర్‌కు బీసీసీఐ నోటీసులు



ఐపీఎల్ 2026లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి భిందర్ డగౌట్‌లో ఫోన్ వాడటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. తాజాగా అతడిపై బీసీసీఐ కఠిన చర్యలకు ఉపక్రమించింది. 48 గంటల్లో ఈ అంశంపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. అయితే ఆరోగ్య అత్యవసర పరిస్థితుల కారణంగానే రోమి భిందర్ డగౌట్‌లో ఫోన్ వాడాల్సి వచ్చిందంటూ పలు నివేదికలు పేర్కొన్నాయి.

ఆ సమయంలో రోమి పక్కనే ఆర్ఆర్ విధ్వంసకర బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందించారు. 'ఈ విషయాన్ని యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ యూనిట్(ఏసీఎస్‌యూ)కి అప్పగించాం. పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించాం' అని తెలిపారు. ఏసీఎస్‌యూ ఇప్పటికే భిందర్‌కు 48 గంటల గడువు ఇస్తూ నోటీస్ పంపినట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. రోమిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహిరంగంగా డిమాండ్ చేయడం గమనార్హం.

**కారణాలు ఏవైనా..**

భిందర్ ఫోన్ వినియోగం వెనుక వైద్య కారణాలు ఉన్నాయని పలు నివేదికలు చెబుతున్నాయి. గతంలో తీవ్రమైన ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందిన ఆయన ప్రస్తుతం ఆస్తమాతో బాధపడుతున్నట్లు సమాచారం. 'ఆరోగ్య పరిస్థితుల కారణంగా రోమి భిందర్ ఎక్కువగా నడవలేరు. డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లేందుకు మెట్లు ఎక్కాల్సి రావడంతో డగౌట్‌లోకి ఫోన్ తెచ్చుకున్నారు. కాల్, మెసేజ్‌లు లాంటివి ఏమీ చేయలేదు. కేవలం స్క్రోల్ చేశారు' అని జట్టు వర్గాలు వెల్లడించాయి. అతడి ఆరోగ్య పరిస్థితులను బీసీసీఐ పరిగణనలోకి తీసుకుంటుందని అనుకున్నప్పటికీ తాజాగా నోటీసులు జారీ చేయడం కొసమెరుపు. ఈ వివాదంపై ఏసీఎస్‌యూ తుది నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### మహిళల టీ20 ప్రపంచకప్

## రికార్డు స్థాయిలో ప్రైజ్‌మనీ




మహిళల క్రికెట్ చరిత్రలో మరో కీలక ముందడుగు పడింది. ఈ ఏడాది జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 జరగనున్న విషయం తెలిసిందే. ఈ మెగా టోర్నీకి ఇంగ్లండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే దీనికి సంబంధించి తాజాగా ఐసీసీ రికార్డు స్థాయిలో ప్రైజ్ మనీని ప్రకటించింది. దీంతో ఈ టోర్నీకి గ్లోబల్ స్థాయిలో మరింత ప్రాధాన్యం పెరుగనుంది. 2024తో పోలిస్తే ఈసారి 10 శాతం ప్రైజ్‌మనీని పెంచడం విశేషం. ఓవరాల్‌గా ఈ టోర్నీకి రూ.82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది. కాగా ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. ఫైనల్ మ్యాచ్ ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరగనుంది.

**ప్రైజ్ మనీ వివరాలు ఇలా..**

విజేతకు సుమారు రూ.21.8 కోట్లు, రన్నరప్ జట్టుకు రూ.10 కోట్లు, సెమీస్‌లో ఓడిన జట్లకు రూ.6.29 కోట్లు, ప్రతి గ్రూప్ మ్యాచ్ గెలుపునకు సుమారు రూ.29 లక్షలు దక్కనున్నాయి. అత్యంత ముఖ్యంగా టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు కనీసం రూ.2.06 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించడం మహిళల క్రికెట్ అభివృద్ధికి పెద్ద అడుగుగా భావిస్తున్నారు. టోర్నీ ఆరంభ మ్యాచ్ జూన్ 12న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ స్టేడియంలో జరగనుంది. ఆ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఇంగ్లండ్, శ్రీలంకతో తలపడనుంది. ఈ వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా, భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ వంటి బలమైన జట్లు పోటీలో ఉండటంతో టోర్నీపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సందర్భంగా ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఈ విషయంపై మాట్లాడారు. 'మహిళల క్రికెట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. జట్ల సంఖ్య పెంచడంతో పాటు రికార్డు స్థాయిలో ప్రైజ్‌మనీ ప్రకటించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పోటీ స్థాయిని మరింత పెరుగుతుందని ఆశిస్తున్నామని తెలిపారు.

## రోహిత్ గాయంపై రూథర్‌ఫర్డ్ కీలక వ్యాఖ్యలు



ఐపీఎల్ 2026 భాగంగా ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. రోహిత్ గాయం ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. తాజాగా రోహిత్ గాయంపై మ్యాచ్ అనంతరం ముంబై స్టార్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అప్‌డేట్ ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. 'రోహిత్ తొడ కండరాలు పట్టేసినట్లు అనిపిస్తోంది. కానీ కచ్చితంగా నాకు తెలియదు. వైద్యులు కూడా రోహిత్ గాయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం అతడు మా వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నాడు. స్కాన్ రిపోర్ట్‌ల కోసం వేచి చూస్తున్నాం. రోహిత్ ఫిట్‌నెస్ గురించి త్వరలోనే పూర్తి సమాచారం తెలుస్తుంది' రూథర్‌ఫర్డ్ పేర్కొ న్నాడు. ఒకవేళ రోహిత్ గాయం తీవ్రత గ్రేడ్-1గా ఉంటే పూర్తిగా కోలుకోవడానికి సుమారు నాలుగు వారాల సమయం పడుతుందని క్రీడా వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. అదే జరిగితే రోహిత్ ఐపీఎల్ 2026 మధ్యలోనే వైదొలిగే అవకాశ ముందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు.. ఏదేమైనప్పటికి రోహిత్ త్వరగా కోలుకుని తిరిగి మైదానంలో అడుగుపెట్టాలని అతడి అభిమానులు, ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నారు.

**అసలేం జరిగిందంటే...**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో 241 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కి రోహిత్ శర్మ మంచి ఆరంభాన్ని ఇచ్చేందుకు ప్రయత్నించాడు. కానీ 6వ ఓవర్‌లో రోహిత్‌కు తొడ కండరాలు పట్టేశాయి. వికెట్ల మధ్య పరిగెత్తేందుకు చాలా ఇబ్బంది పడ్డాడు. వెంటనే ఫిజియో మైదానంలోకి వచ్చి రోహిత్‌ను పరీక్షించాడు. అయినా ఏ మాత్రం రోహిత్ తొడ కండ నొప్పి తగ్గలేదు. దీంతో అదే ఓవర్‌లో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు.

### ఆశా భోస్లే భౌతికకాయం వద్ద సచిన్ కన్నీళ్లు



ప్రముఖ గాయని ఆశా భోస్లే ఆదివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 92 ఏళ్ల వయసులో ఆమె కన్నుమూశారు. ఆశా అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజీ పార్క్‌లో జరగనున్నాయి. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని సందర్శనార్థం ఆశా స్వగ్రామం ముంబైలో ఉంచారు. ఈ క్రమంలో ఆశా భౌతికకాయానికి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అతడి భార్య అంజలితో కలిసి నివాళు లర్పించారు. ఆశా భోస్లేతో సచిన్ కుటుంబానికి చాలాకాలంగా అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పిస్తూ సచిన్ కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపాడు. అతడితో పాటు ఆశా భోంస్లేను చివరిసారిగా చూసేందుకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు కూడా కన్నీటి వీడ్కోలు పలికారు. సంగీత ప్రపంచంలో ఆమె సేవలను స్మరించుకుంటూ దేశ వ్యాప్తంగా ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 14 ఏప్రిల్ 2026 X

# ఎస్క్వైర్ కవర్‌పై చరణ్



రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ముద్ర వేశారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఎస్క్వైర్ ఇండియా ఏప్రిల్ ఎడిషన్ కవర్ పేజీపై దర్శనమిచ్చారు. దుబాయ్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన ఫోటోషూట్‌లో రామ్‌చరణ్ స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే గ్లోబల్‌స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న చరణ్... ఈ కవర్ ఫీచర్‌తో మరో మైలురాయిని అందుకున్నారు. గతంలో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే మ్యాగజైన్ కవర్‌పై కనిపించగా, ఇప్పుడు ఆ ఘనత సాధించిన రెండో తెలుగు హీరోగా రామ్‌చరణ్ నిలిచారు. దీంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫోటోషూట్‌లో చరణ్ స్టైలింగ్, ప్రెజెన్స్ అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండటంతో, ఆయన గ్లోబల్ అప్పీల్ మరింత బలపడిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభిమానులు ఆయన పూర్తి ఇంటర్వ్యూ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రామ్‌చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. ఒక పాట వినా మిగిలిన భాగాలన్నీ కంప్లీట్ కాగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## మారిముత్తు చేతికి తలైవర్ ప్రాజెక్టు?

రజినీకాంత్ అభిమానులకు వినోదాన్ని అందించడమే ధ్యేయంగా వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. రజినీకాంత్ నటిస్తోన్న సినిమాల్లో మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ తలైవర్ 173. సినిమా సెట్స్‌పైకి వెళ్లడం మాట అటుంచితే డైరెక్టర్ విషయంలో మాత్రం ఎప్పుడూ ఏదోరకంగా వార్తల్లో నిలుస్తూనే ఉంది. ఇప్పటికే ఈ చిత్రం దర్శకత్వ బాధ్యతల నుంచి డైరెక్టర్ సుందర్ సీ తప్పుకున్నాడని తెలిసిందే. తర్వాత ఈ ప్రాజెక్ట్ డాన్, తేరి, మెర్సల్ సినిమాలను తెరకెక్కించిన డైరెక్టర్ సిబి చక్రవర్తి చేతుల్లోకి వెళ్లింది. ఈ విషయాన్ని అధికారికంగా కూడా ప్రకటించేశారు మేకర్స్. అయితే ఇప్పుడు ఈ మూవీకి మరోసారి డైరెక్టర్ మారాడన్న వార్త నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. కోలీవుడ్ డైరెక్టర్ అశ్వత్ మారిముత్తుతో మేకర్స్ చర్చలు జరుపుతున్నారన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఏంలేకున్నా మూవీ లవర్స్‌తోపాటు అభిమానుల్లో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. మరి రాబోయే రోజుల్లో తలైవా టీం ఏదైనా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కానీ చేస్తుందా.. అనేది చూడాలి.

## యాక్షన్ సీక్వెన్స్‌కు బాలయ్య రెడీ




నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబో చిత్రం –మ్యూజిక్ సిట్టింగ్స్‌తో మొదలైంది. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్‌ఎస్ థమన్ సిద్ధం చేసిన రెండు ట్యూన్స్‌లో.. ఒక ట్యూన్‌కి లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్ పాట రాశారట. ఈ పాటను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. సాంగ్ షూట్ పూర్తైన వెంటనే అక్కడే కీలక యాక్షన్ సీక్వెన్స్‌నూ చిత్రీకరిస్తారని సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కానున్నాయని చిత్ర వర్గాలు మాట. సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను రాజుగా చూపిస్తే.. హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనుంది. దీంతో ఇదొక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్టు స్పష్టమవుతోంది. బాలయ్య-నయనతార కాంబోకి ఉన్న క్రేజ్ (సింహా, శ్రీరామరాజ్యం, జై సింహా) కారణంగా.. మరోసారి ఈ జోడీని తెరపై చూసేందుకు అభిమానుల్లో ఆసక్తి లేకపోలేదు. ఈ భారీ ప్రాజెక్టును నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

## ఇతిహాసాల టచ్‌తో 'రాకా'



అల్లు అర్జున్, దీపికా పదుకొనె జోడీగా కోలీవుడ్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ సినిమా 'రాకా'. ఇటీవల వచ్చిన షాకింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ సాలిడ్ హైప్ సెట్ చేసింది. ఊహించని మేకోవర్‌లో అల్లు అర్జున్ కనిపించడంతో ఒక సాహసోపేత పాత్ర చేస్తున్నట్టు అర్థమైంది. సినిమా కథాపరంగా ఓ క్రేజీ బజ్ కొత్తగా వినిపిస్తోంది. అది –ఈ కథకు అట్లీ సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్‌తో పాటుగా మైథాలజీ టచ్ కూడా ఇచ్చాడని. తోడేళ్ళకి సంబంధించి పురాణాల్లో ఉన్న కొన్ని ఆసక్తికర అంశాలతో సినిమా ప్లాన్ చేసుకున్నట్టు సమాచారం. మరి ఈ రెండూ అట్లీ పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తే మాత్రం ఆడియన్స్‌కి మరో సాలిడ్ ట్రీట్ ఖాయం. ఈ సినిమాకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే సన్ పిక్చర్స్ సినిమా నిర్మిస్తోంది.

## 'భరతవర్ష'గా గోపీచంద్



యాక్షన్ హీరో గోపీచంద్ 'భరతవర్ష'తో కమ్‌బ్యాక్‌కు ట్రై చేస్తున్నాడు. పవర్‌ఫుల్ టైటిల్‌తో ప్రకటించిన కొత్త ప్రాజెక్టు టైటిల్ గ్లింప్స్ చూస్తే అదే అనిపిస్తుంది. గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ.. యుద్ధరంగంలో శత్రువులపై విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ ఇస్తున్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉంటుందన్న సంకేతాలిచ్చాడు. స్వాతంత్ర్యానికి ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్టు ఇండస్ట్రీ టాక్. కథలో మైథాలజీ టచ్ ఉండే అవకాశముందని అంటున్నారు. గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్. ఆమె పాత్ర కథలో కీలకం కానుందట. టెక్నికల్‌గా హైస్టాండర్డ్స్‌తో సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని టాక్. గోపీచంద్ కెరీర్‌లో ఇదొక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయమన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

## విలన్‌గా షాహిద్ ఓకే చెప్తాడా?

జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న –డ్రాగన్ క్రేజ్ మామూలుగా లేదు. 'ఆర్ఆర్ఆర్', 'దేవర'వంటి వరుస విజయాల తర్వాత ఎన్టీఆర్ చేస్తున్న ప్రాజెక్టు కావడం, 'కేజీఎఫ్', 'సలార్'వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వం –ప్రాజెక్ట్‌పై అంచనాలు రెట్టింపయ్యాయి. హీరోతో సమానంగా పవర్‌ఫుల్ విలన్ పాత్ర ఉంటుందన్న టాక్ నేపథ్యంలో.. ఆ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పేరును పరిశీలిస్తున్నారట. ఎన్టీఆర్‌కు ధీటుగా నిలిచే విలన్‌గా ఆయనను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చర్చలు జరిగాయని, త్వరలో అధికారిక ప్రకటన రావొచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఈ సినిమాలో ఎన్టీఆర్ ఇప్పటివరకు చూడని రగ్గడ్, ఊరమాస్ లుక్‌లో కనిపించనున్నాడని ఎప్పటినుంచో వినిపిస్తోంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సినిమా ఫస్ట్ లుక్ లేదా టైటిల్ టీజర్ విడుదల చేసే అవకాశముందట. ఈ ప్రాజెక్టులో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణి వసంత్ కనిపించనుంది.

